ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 16 ఆగస్టు 2026 | సంపుటి: 1 | సంచిక: 60 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

### హర్మూజ్ జలసంధి ఇరాన్‌దే



హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానన్న ట్రంప్

ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్ మంత్రి కాజెమ్ గరీబాబాడీ

2



## పీవోకేలో పరిస్థితి బాధాకరం

స్వాతంత్ర్య వేడుకల్లో ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు

2



# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ

## వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ

**తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన**

**పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు**

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని దిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. దిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు.

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 15 (సింగిడి)**

2

### భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

- అన్ని రంగాల్లో దూసుకు పోయే తత్వం
- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోడీ పిలుపు
- ఎర్రకోట వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే

# కొత్త పింఛన్లు... పాత బకాయిలు?

**కొత్త పింఛన్లకు శ్రీకారం**

**ప్రాధాన్య వర్గాలకే తొలి అవకాశం** | **అర్హతలపై కఠిన పరిశీలన**

## వృద్ధాప్య పింఛన్లపై ఇంకా సస్పెన్స్.. గత చెల్లింపులపై వీడని అయోమయం

## సమాధానం కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

చేయూత మొదలైంది... కానీ చేయూత కోసం ఎదురుచూసిన వారి ప్రశ్నలు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయి! ఆగస్టు 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి దశలో సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. అయితే కొత్త పింఛన్ మంజూరైన ఆనందం ఒకవైపు... గత నిరీక్షణకు పరిష్కారం ఏంటన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న! ఏళ్లుగా దరఖాస్తు చేసి ఎదురుచూస్తున్న వారికి గత కాలానికి సంబంధించిన బకాయిలు ఇస్తారా? లేక ఆగస్టు 15 నుంచే లెక్క మొదలవుతుందా? వృద్ధాప్య పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి అవకాశం ఎప్పుడు? కొత్త జాబితా వచ్చింది... కానీ పాత ప్రశ్నలకు సమాధానం ఎక్కడ? ఇదే ఇప్పుడు లబ్ధిదారుల ఆవేదన.

**- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)**



### కొత్త పింఛన్లకు శ్రీకారం

ఆగస్టు 15 నుంచి కొత్త సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి దశలో సుమారు 2.50 లక్షల మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పింఛన్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కొంత భరోసా కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే తొలి విడతలో ఎంపిక చేసే వర్గాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తోంది.

### ప్రాధాన్య వర్గాలకే తొలి అవకాశం

వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో థలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులను కూడా జాబితాలో చేర్చారు. దీంతో సామాజిక, ఆరోగ్యపరంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వర్గాలకు ముందుగా చేయూత అందే అవకాశం ఏర్పడింది. అయితే వృద్ధాప్య పింఛన్లకు ఈ విడతలో ప్రాధాన్యం లేకపోవడంపై వృద్ధుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### అర్హతలపై కఠిన పరిశీలన

కొత్త పింఛన్ల కోసం గతంలో అమల్లో ఉన్న అర్హత ప్రమాణాలనే ప్రభుత్వం కొనసాగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు ఉండాలి. కుటుంబానికి 3 ఎకరాల మాగాణి లేదా 7.5 ఎకరాల మెట్ట భూమి మించకూడదు. అర్హత ఉన్నప్పటికీ ఇంకా దరఖాస్తు చేయని వారు ఆగస్టు 31, 2026 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనంతరం ఆన్‌లైన్ నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా అర్హులను గుర్తించనున్నారు.

### వృద్ధాప్య పింఛన్లపై ఇంకా సస్పెన్స్

కొత్త పింఛన్ల ప్రక్రియలో వృద్ధాప్య పింఛన్ల మంజూరుపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వయసు నిబంధనలు పూర్తి చేసి దరఖాస్తు చేసుకున్న వృద్ధులు తమ వంతు ఎప్పుడు వస్తుందో ఎదురుచూస్తున్నారు. ఇతర వర్గాలకు ప్రాధాన్యం కల్పించిన ప్రభుత్వం... వృద్ధాప్య పింఛన్లపై తదుపరి నిర్ణయం ఎప్పుడు తీసుకుంటుందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది.

### గత చెల్లింపులపై వీడని అయోమయం

ఇప్పుడు లబ్ధిదారుల్లో ప్రధానంగా చర్చ జరుగుతున్నది గత కాలానికి సంబంధించిన పింఛన్ చెల్లింపులపైనే. ఏడాది, రెండేళ్లుగా ...మిగతా 2లో

## 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం



బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానాలి

సంగారెడ్డి సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## సంగారెడ్డి సభలో రేవంత్ అబద్ధాల ప్రచారం

కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న పెద్దమనిషి: హరీష్ రావు




నేడు తెరుచుకోనున్న

## శబరిమల ఆలయం

2

కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకోనుంది. చింగం మాస పూజల నిమిత్తం ఆలయాన్ని తెరుస్తున్నామని, భక్తులకు సౌకర్యాలు కలిపించేందుకు ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డ్ (టీడీబీ), కేఎస్ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

**తిరువనంతపురం,ఆగస్ట్ 15 (సింగిడి)**




## గ్యాస్ ఈకెవైసికి నేటితో ముగియనున్న గడువు

2

### తెలంగాణ రైజింగ్-2047 దిశగా

# అడుగులు వేస్తున్నాం

కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు

- **ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**
- **గ్రూప్ పరీక్షలను సమర్ధంగా నిర్వహించాం**
- **త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ**
- **ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం**
- **తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం**
- **గోల్కొండ కోట నుంచి సిఎం రేవంత్ ప్రసంగం**



ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు.

**హైదరాబాద్,ఆగస్ట్ 15 (సింగిడి)**

### కృష్ణా-గోదావరి జలాల్లో

## రాజీ ప్రసక్తే లేదు

2

- సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
- తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నాం
- అధికారంలోకి రాగానే 2 లక్షల రుణామఫీ చేపట్టాం
- గోల్కొండలో జెండా ఎగరేసిన సిఎం రేవంత్ రెడ్డి



2

## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

- పేదరికం నిర్మూలించే బలమైన అడుగు
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సిఎం రేవంత్



2

## వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

స్వర్ణాంధ్ర ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం

- **అమరావతిలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**
- **మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించిన సీఎం**
- **ప్రతిభ కనపర్చిన పోలీసులకు పతకాలు అందించిన ముఖ్యమంత్రి**

## లోక్‌భవన్‌లో ఎట్ హోం

**ప్రముఖుల సందడి**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏపీ, తెలంగాణ లోక్‌భవన్‌లలో నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమాలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి. ఏపీలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇచ్చిన తేనీటి విందుకు సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

**విజయవాడ, ఆగస్టు 15 (సింగిడి)**

2



ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
16 ఆగష్టు 2026

## కొత్త పింఛన్లు... పాత బకాయిలు?

మొదటి పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకుని వెయిటింగ్‌లో ఉన్న వారికి... దరఖాస్తు చేసిన తేదీ నుంచి బకాయిలు చెల్లిస్తారా? లేక ఆగస్టు 15 నుంచే లెక్క మొదలవుతుందా? అన్న అయోమయం నెలకొంది. కొత్త పింఛన్ మంజూరుతో భవిష్యత్తుపై భరోసా ఏర్పడినా... గత కాలానికి సంబంధించిన చెల్లింపులపై స్పష్టమైన విధానం లేకపోవడం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

**లబ్ధిదారుల ఎదురుచూపులు**

చేయూత పింఛన్ల కొత్త దశ ప్రారంభమైనా... గత చెల్లింపులపై ప్రశ్నలు మాత్రం అలాగే ఉన్నాయి. దరఖాస్తు చేసిన నాటి నుంచి బకాయిలు చెల్లిస్తారా? ఆగస్టు 15 నుంచే లెక్కిస్తారా? వృద్ధాప్య పింఛన్లకు అవకాశం ఎప్పుడు? అన్న అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి. కొత్త లబ్ధిదారులకు పింఛన్ అందించడంతో పాటు... గతంలో దరఖాస్తు చేసి ఎదురుచూస్తున్న వారి విషయంలోనూ న్యాయమైన నిర్ణయం తీసుకున్నప్పుడే పథకానికి పూర్తి విశ్వసనీయత లభిస్తుంది. చేయూత మొదలైంది... ఇప్పుడు లబ్ధిదారుల ప్రశ్నలకు కూడా ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చింది.

## వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

**అమరావతి, ఆగస్టు 15 (సింగిడి)**

ఆంధ్రప్రదేశ్‌ను వికాసం నుంచి వైభవం వైపు నడిపిస్తున్నామని.. సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 స్వర్ణాంధ్ర సాధన సంకల్పం 5.5 కోట్ల మంది ఆంధ్రులు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 80 స్వాతంత్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో ఆయన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. పోలీసు దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి జాతీయత, దేశభక్తితో కూడిన స్ఫూర్తి దాయకమైన ప్రసంగం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "భారతీయులకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు. మనకు స్వాతంత్యం అంత తేలికగా ఒక్కరోజులో ఒక్కరి పోరాటంతో రాలేదు. దశాబ్దాల పోరాటం ఎందరో మహనీయుల బలిదానం, మరెందరో అమరవీరుల ప్రాణత్యాగం మనకు స్వాతంత్యాన్ని అందించాయి. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు చూసిన స్వప్నాన్ని సాకారం చేద్దాం. 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని నెంబర్ 1 చేద్దామన్న లక్ష్యంతో పనిచేద్దాం. హక్కుల్ని, గౌరవాన్ని ఇచ్చిన దేశానికి మనమేం చేయాలన్న ఆలోచనతో పనిచేద్దాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వచ్చే 20 ఏళ్లు అనునిత్యం పనిచేస్తామని సంకల్పం తీసుకోవాలి. ఈ దేశానికి మనం ఏం ఇవ్వగలం అని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. మనం ఏ పని చేసినా దేశ భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని, సమాజహితం కోసం పనిచేయాలి. విద్యార్థి ఆవిష్కరణలతో రైతులు ప్రకృతి సాగుతో, ఉద్యోగి అంకిత భావనతో, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి. వ్యక్తిగత విజయాలన్నీ దేశ నిర్మాణంలో భాగం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్ లక్ష్యం, మనం రూపొందించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఏపీ దేశానికి బలమైన రాష్ట్రంగా ఎదగాలి. అంతా కలిసి ఐక్యంగా స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధిద్దాం. దీనికి దృఢమైన సంకల్పం చేద్దాం". అని ముఖ్యమంత్రి అన్నారు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం పెంచేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. దీంతో 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి రావడం మనపై నమ్మకాన్ని పెంచింది. రెండేళ్లలో ఎఫ్‌డిఐ ఆరున్నర రెట్లు పెరిగింది. గూగుల్ ఏఐ డాటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జెఎస్ డబ్ల్యు స్టీల్, దాల్మియా సిమెంట్, ఎఎం గ్రీన్ అమెనియా, హీరో, రాయల్ ఎన్ ఫీల్డ్, స్వర్ణగిరి గోల్డ్ మైన్ వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయి..95 వేల కోట్ల విలువైన బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో 36 రోజుల్లోనే ఆమ్నా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 138 పార్కులకు శ్రీకారం చుట్టాం. సమాజంలో ప్రతీ వర్గానికి న్యాయం జరిగేలా చూస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నాం. నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవితకు పునాదులు వేస్తున్నాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంతో సంజీవని తీసుకువచ్చాం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుంది. సీఎం సహాయ నిధి ద్వారా ఇప్పటి వరకూ రూ.1,631 కోట్లు వ్యయం చేసి పేదల్ని ఆదుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద ప్రతిరైతుకూ 20 వేలు అందిస్తున్నాం. పొగాకు, కోకూ, మామిడి రైతులను మద్దతు ధరతో ఆదుకున్నాం. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీతో సహకారం అందిస్తున్నాం. లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేస్తున్నాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుడతాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసేలా చెరువులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందిస్తున్నాం. "అని సీఎం వివరించారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వయం బ్రాండ్ పేరిట వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏపీలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇవ్వటం ద్వారా పెట్టుబడులు సాధిస్తున్నాం. రెండేళ్లలో రూ.19,390 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. బీచ్ టూరిజం, టెంపుల్, హోమ్ స్టేలను ప్రోత్సహిస్తున్నాం. ప్రజలకు పాలన దగ్గర చేసేందుకు మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. అన్నమయ్య జిల్లాకు మదనపల్లెను కేంద్రంగా మార్చాం. వారసత్వంగా వచ్చిన ఆస్తులు, భూమిపై హక్కులు కాపాడేలా రెవెన్యూలో సంస్కరణలు తెచ్చాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగాన్ని బలోపేతం చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట, నాలా చట్టాన్ని రద్దు చేశాం. నకిలీ మద్యం బ్రాండ్‌కు చెక పెట్టాం. ఎక్సైజ్ రంగాన్ని ప్రక్షాళన చేశాం. ప్రజలే ఫస్ట్ నినాదంతో పీపీపీకి ప్రాధాన్యం ఇస్తున్నాం. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించాం. రాష్ట్రంలో ఆధ్యాత్మికతను పెంచేందుకు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల పవిత్రతను కాపాడేలా చర్యలు చేపట్టాం. ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా ఉంటాం. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం. రాష్ట్రంలో అవకాశాలను అందిపుచ్చుకుని ఏపీని స్వర్ణాంధ్రగా మారుద్దాం. దేశం గర్వించేలా రాష్టాన్ని నిర్మిద్దాం". అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతకు ముందు ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్సీసీ, స్కౌట్స్ విద్యార్థుల కవాతు నిర్వహించి సీఎం కు గౌరవ వందనం సమర్పించాయి. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ప్రతిభ కనపరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి సీఎం పోలీసు మెడల్స్‌ను అలంకరించారు.

## తెలంగాణ రైజింగ్-2047 దిశగా అడుగులు వేస్తున్నాం

గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లారుమెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయ స్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్సీ, పెన్షన్లు, ఎంప్లా- లాయిస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు.

# ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోడీ



దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందే మాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవ వందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్య దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందే మాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.

## భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (సింగిడి)**

పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యవత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు. 'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా.. అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ నక్సల్స్ కనుమరుగైనా.. 'దిమాగీ నక్సల్స్' మిగిలి ఉన్నారు. వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని సూచించారు. తయారీ, వ్యవసాయం, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగం, గ్రీన్ అండ్ బ్లూ ఎకానమీ, ఇండియాస్ సాఫ్ట్ పవర్ కోసం 'సప్తధార' రోడ్‌మ్యాప్‌ను మోదీ ప్రకటించారు. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతిపక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక ప్రపంచంలో చిప్‌ల విలువను భారత దేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సమీప భవిష్యత్తులో మరిన్ని సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆపడంఅసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల సంభవించిన విపత్తుల గురించి ప్రస్తావించారు. బాధిత కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని సంఘీభావం తెలిపారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం.

## ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (సింగిడి)**

అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌తో జరుగుతున్న పోరులో విజయం సాధించిన అనంతరం హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ అత్యంత ఘాటుగా స్పందించింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా మండిపడిన ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాడీ, ఒక సోషల్ మీడియా ట్వీట్ ద్వారానో, యుద్ధనౌకలతో బెదిరించడం ద్వారానో లేదా ఎన్నికల ఉపన్యాసాలతోనో హర్మూజ్ జలసంధిని ఎవరూ ఆక్రమించలేరని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి ఇరాన్‌దేనని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ విధించిన షరతులను అంగీకరించే వరకు జలసంధిని మూసివేయడం లేదా తెరవడం పూర్తిగా ఇరాన్ కమాండ్ నియంత్రణలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతానికి పైగా జరిగే ఈ వ్యూహాత్మక మార్గంలో అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

## పీవోకేలో పరిస్థితి బాధాకరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (సింగిడి)**

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు గురించి స్వాతంత్య వేడుకల్లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. ఈ ప్రత్యేక హోదాను కేంద్రం రద్దు చేయకపోయి ఉంటే.. జమ్మూకశ్మీర్‌లో విలీనం అయ్యేందుకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు తిరుగుబాటు చేసేవారని అన్నారు. ''1947లో పాకిస్తానీ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా కశ్మీర్ ప్రజలు పోరాడారు. ఇప్పుడు సరిహద్దుల్లో పరిస్థితులను చూసినప్పుడు.. మన పూర్వీకులు చెప్పిన మాట నిజమని అర్థమవుతోంది. 'దాడికి దిగాలనుకునేవారికి హెచ్చరిక.. మీకు బుద్ధి చెప్పేందుకు కశ్మీరీలం అయిన మేం సిద్ధంగా ఉన్నాం' అని వారు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం పాక్ ఆక్రమిత కశ్మీర్ (POK)లోని ప్రజల పరిస్థితి చూస్తుంటే.. బాధగా ఉంది. రాష్ట్ర హోదా, ప్రత్యేక హోదా రద్దు చేయకపోయి ఉంటే.. తమను తిరిగి జమ్మూకశ్మీర్‌లో విలీనం చేయమని పీఓకే ప్రజలు తిరుగుబాటు చేసేవారని నేను భావిస్తున్నాను. వారికోసం మనం అసెంబ్లీలో సీట్లు ఖాళీగా ఉంచుతున్నాం. ఏదో ఒకరోజు ఆ సీట్లు నిండుతాయన్న ఆశతో ఉన్నాం'' అని అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించేవరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. భాజపా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ''ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు. ఈ స్వాతంత్య దినోత్సవం రోజున ఆయన రాజకీయాలు చేస్తున్నారు. భవిష్యత్ ప్రణాళికలు మాట్లాడాల్సిన ఈ వేదికను ఆయన రాజకీయాలకు వాడుకున్నారు'' అంటూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు సునీల్ శర్మ దుయ్యబట్టారు.

## నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

ఆలయ పూజారి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ఆలయ ప్రధాన పూజారి ప్రసాద్ ఇ.డి.ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరుస్తారని టీడీబీ ఓ ప్రకటనలో తెలిపింది. మలయాళ నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని ఈనెల 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చింగం మాస పూజలు ముగిశాక ఆగస్టు 21 రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసివేసి, తిరిగి ఓనం పండుగ పూజల కోసం ఈనెల 24న తెరుస్తారు.

## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

**సంగారెడ్డి,ఆగస్ట్15 (సింగిడి)**

స్మార్ట్ రేషన్ కార్డు అనేది కేవలం ఒక ప్లాస్టిక కార్డు లేదా ఉచితంగా బియ్యం పొందే సాధనం మాత్రమే కాదని, పేదరికాన్ని నిర్మూలించే దిశగా వేసిన బలమైన అడుగని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ నాడు రేషన్ వ్యవస్థను తీసుకొచ్చిందని అన్నారు. గతంలో ఇందిరాగాంధీని మెదక ఎంపీగా గెలిపించడం వల్లే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. సంగారెడ్డి వేదికగా జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని లబ్దిదారులకు కార్డులను అందజేశారు. నాయకుడు జగ్గారెడ్డి పర్యవేక్షణలో స్వాతంత్య దినోత్సవం రోజున వేలాదిమంది మహిళల సమక్షంలో ఈ సభ నిర్వహించు కోవడం ఎంతో ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకునే తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు వేర్వేరు కాదని, ఆ రెండు పార్టీలు ఒకే నాణెలినికి బొమ్మ, బొరుసు లాంటివని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏనాడైనా పేద ప్రజల ఆకలి తీర్చాలని ఆ పార్టీలు ఆలోచించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో దాదాపు 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన బియ్యం దొడ్డుగా ఉండి, మనుషులు తినలేక బర్లకు దాణాగా వేసే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు తాము ఇస్తున్న సన్న బియ్యం ప్రతి పేద కుటుంబానికి కడుపు నింపుతోందని వివరించారు. తెలంగాణలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయన్నారు. ల్గ' తులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా. పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం అని సవాల్ చేశారు. అతితక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం అని సిఎం అన్నారు.పదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని వారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటామని రేవంత్ అన్నారు.. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్టాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఈకెవైసికి నేటితో ముగియనున్న గడువు

**హైదరాబాద్, ఆగస్టు 15 (సింగిడి)**

గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీని చేసుకోవాలని, ఈనెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనుంది. పలు కంపెనీలకు చెందిన గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు వినియోగదారులకు మెసేజ్‌లు, ఫోన్‌లు చేసి ఈకేవైసీని తప్పనిసరిగా చేసుకోవాలని, లేకుంటే గ్యాస్ రాదని స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఇలా చేయకపోతే సబ్సిడీ రద్దవుతుందని, ఆంక్షలు విధించే అవకాశ ముందని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఈకేవైసీని చేసుకునేందుకు వినియోగదారులు క్యూకట్టారు. అయితే శనివారం స్వాతంత్య దినోత్సవం, ఆదివారం సెలవులు కావడంతో ప్రజలు సందేహంలో ఉన్నారు. ఏజెన్సీల నిర్వాహకులను వివరణ కోరగా.. శని, ఆదివారం వర్కింగ్ డేగా ఉందని తెలుస్తోందని, పై నుంచి తేదీని పెంచితే సెలవు ఉంటుందని తెలుపుతున్నారు. త్వరితగతిన ఏజెన్సీల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.



## లోక్‌భవన్‌లో ఎట్ హోం

సీఎం చంద్రబాబు దంపతులకు గవర్నర్ దంపతులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీజే జస్టిస్ లిసా గిల్, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొనగా.. విచ్చేసిన అతిథులను గవర్నర్ స్వయంగా పలకరించారు. మరోవైపు, తీవ్ర జ్వరంతో బాధపడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

## 89 లక్షల కార్డులను 2.80 కోట్లకు చేర్చాం

**సంగారెడ్డి,ఆగస్ట్15 (సింగిడి)**

తెలంగాణలో ఇస్తున్నట్లు దేశంలో ఎక్కడా కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 3.42 కోట్ల మందికి రూ.14800 కోట్లతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో 89 లక్షల రేషన్ కార్డులు ఉంటే.. వాటిని 2.80 కోట్లకు పెంచామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు.. నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీలోని నేతలు పదే పదే అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల నుంచి చుక్క నీరు తీసుకోకుండా దేశంలోనే ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణలో పండించామన్నారు. వరి కొనుగోళ్లలో రూ.90 వేల కోట్లు.. రైతుల ఖాతాల్లో వేశామని అన్నారు. ఈరోజు సంగారెడ్డి చరిత్రలోనే కాదు, తెలంగాణ చరిత్రలోనే ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోనుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు రేషన్ కార్డులు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు రేషన్ కార్డుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని వెల్లడించారు. కొత్తగా 16 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని అన్నారు. హయాంలో రేషన్ కింద దొడ్డు బియ్యం ఇచ్చారని.. అప్పుడు ఆ బియ్యాన్ని ఎవరూ తినకుండా కిలో రూ.10కి అమ్ముకునే వారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక సన్న వడ్లకి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి వాటినే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ఉన్న సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు చరిత్రలో పండుగలా గుర్తుండిపోతుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16 లక్షల కొత్త కార్డులు ఇచ్చాం. గతంలో రేషన్‌లో దొడ్డు బియ్యం వచ్చేవి. ఆ బియ్యాన్ని 80 శాతం మంది తినేవారు కాదు. కానీ, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక సన్నబియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొంటున్నాం. మనిషికి ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వడం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి కార్డులు ఇస్తాం అని ఉత్తమ్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే కుటుంబానికి గౌరవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అంటే ఆహార భద్రత, ప్రభుత్వం ఇచ్చే ఒక గుర్తింపు అని తెలిపారు.

## సంగారెడ్డి సభలో రేవంత్ అబద్దాల ప్రచారం

**సిద్దిపేట, ఆగస్టు 15 (సింగిడి)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశంలో స్వాతంత్య దినోత్సవం రోజునా చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్ రావు మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 4:20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలు మాట్లాడారని మండిపడ్డారు. ఆయన తన ప్రసంగంలో ఉమ్మడి మెదక జిల్లా గురించి ఒక్క మాటా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రేవంత్ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని ఆరోపించారు కామారెడ్డి జిల్లాకు మంచినీళ్లు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
16-8-2026




# సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే..
# ప్రభుత్వ పాలన లక్ష్యం

- మంత్రి దామోదర రాజనర్సింహా
- స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాల పంపిణీ
- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 15 (సింగిడి):** నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు తదితర వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు, చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మంత్రి దామోదర రాజనర్సింహా ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అసమానతల నిర్మూలనే అసలైన స్వేచ్ఛ

బడుగులకు న్యాయం
కాంగ్రెస్‌తోనే సాధ్యం..
చిట్కుల్ లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లోపాల్గొన్న నీలం మధు ముదిరాజ్



**పటాన్చెరు, ఆగస్టు 15(సింగిడి):** దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలు పూర్తిగా తొలగిపోయినప్పుడే భారత్ నిజమైన ప్రగతి బాటలో పయనిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లోని ఎస్సీ కాలనీ, మాల బస్తి, అంగన్వాడి కేంద్రం, దుర్గమ్మ గుడి సమీపం, ముదిరాజ్ కాలనీ, గొల్ల కురుమ యాదవ సంఘం, వార్డు కార్యాలయం, పల్లె దవకాన, చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద, పలు కాలనీలలోని జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, స్థానిక ఎన్.ఎం.ఆర్ క్యాంపు కార్యాలయంలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ, వలస పాలన నుంచి దేశానికి స్వేచ్ఛను సాధించిపెట్టిన కాంగ్రెస్ పార్టీ, నేడు బడుగు, బలహీన వర్గాల ఆర్థిక వికాసానికి, సామాజిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని కొనియాడారు. సామాజిక అసమానతలను రూపుమాపేందుకు విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఆయన వివరించారు. బడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నెలకొల్పడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ అందిస్తున్నారని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు 'మహాలక్ష్మి' పథకం ద్వారా రూ. 500 కే గ్యాస్ సిలిండర్, 'గృహ జ్యోతి' కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' ఉచిత వైద్య పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం ద్వారా ప్రతీ పేద కుటుంబానికి కొండంత అభయం లభించిందని తెలిపారు. నేడు సంగారెడ్డి కేంద్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టనున్నారని ఈ రేషన్ కార్డుల ద్వారా సంక్షేమ ఫలాలు నేరుగా అర్హులకు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే 'రాజీవ్ యువ వికాసం' ద్వారా యువత స్వయం ఉపాధి సాధించడానికి రుణాలు, రాయితీలు లభిస్తున్నాయని వివరించారు. మహనీయులు కలలు కనిన సమానత్వ ప్రాతిపదికన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగడమే నాటి స్వాతంత్య్ర పోరాట యోధులకు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు

- బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధుడు.. పోలీసుల దర్యాప్తు

**పటాన్చెరు, ఆగస్ట్ 15 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. రామచంద్రాపురంలోని ఓ ఆలయంలో మైనర్ బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఆలయ ప్రాంగణంలో బాలికతో వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని స్థానికులు గుర్తించినట్లు సమాచారం. ఆలయానికి బయట నుంచి తాళం వేసి, లోపల బాలికతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలో అర్చకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాయన్న అనే వృద్ధుడిపై ఈ ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానికులు, గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



బాలికకు సంబంధించిన వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## భౌరంపేట్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఎస్సీ బస్తీలో జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 15 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భౌరంపేట్‌లోని ఎస్సీ బస్తీలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మిరుదొడ్డి, ఆగస్టు 15 (సింగిడి):** మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజున 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్తు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులలో దేశభక్తిని, సేవాభావాన్ని పెంపొందించడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు. విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగిన దుబ్బరాజోళ్ల సంపత్ ను పాఠశాల కరస్పాండెంట్ సత్తు సుజాత శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ మరియు చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి దుబ్బరాజోళ్ల సంపత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంపత్, తిరుమలరాని, మంగ, స్వప్న,రజిత వాణి తో పాటు విద్యార్థులు , తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్

**సిద్ధిపేట, బ్యూరో ఆగస్టు,15(సింగిడి):** 80 వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ హైమావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటిషర్ల నుండి స్వాతంత్రాన్ని పొందడానికి ఎందరో తమ జీవితాలను త్యాగం చేశారని ఆ త్యాగధనులందరినీ గుర్తు చేసుకుంటు వారి మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి అందరు కృషిచేయాలని అన్నారు. స్వాతంత్రం కోసం కృషి చేసిన ఎంతో మంది మహనీయుల వారి ఆశయాలను అనుగుణంగా దేశ సేవలో మనందరం కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు , కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా పటాన్చెరు

- జాతీయ జెండాను ఎగరవేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్చెరు, ఆగస్టు 15(సింగిడి):** ప్రజల సహకారం.. సమష్టి కృషితో పటాన్చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయం, ఎంపీడీవో, ఎమ్మార్వో, వివిధ సంక్షేమ సంఘాల కార్యాలయాలతో పాటు, మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన పంద్రాగస్టు వేడుకల్లో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాలను ఎగురవేశారు. ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాలు అందరిని అలరించాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరులో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించేలా పటాన్చెరులో ప్రాథమిక పాఠశాల నుండి పీజీ కళాశాల వరకు ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల సైతం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.



తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎంతో నమ్మకంతో వారి భవిష్యత్తు కోసం కష్టపడుతున్నారని అన్నారు. నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. స్థానిక స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు క్రీడల ద్వారా లభిస్తాయని, ప్రతిభ కలిగిన క్రీడాకారులు ప్రపంచ వేదికపై దేశానికి, రాష్ట్రానికి, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారుడికి 50 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతి.. పటాన్చెరు పట్టణానికి చెందిన నర్రా వీరస్వామి ఇటీవల శ్రీలంకలో జరిగిన బాడ్మింటన్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా.. ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా 50వేల రూపాయల ప్రోత్సాహంగా బహుమతి అందించి అభినందనలు తెలిపారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు మూడు లక్షల 80 వేల రూపాయల సొంత నిధులతో నగదు బహుమతులు అందజేశారు. యువజన వికాస సమితి ఆధ్వర్యంలో 80 అడుగుల జాతీయ జెండాతో ప్రత్యేక పరేడ్ అందరిని ఆకర్షించింది. మార్చ్ ఫాస్ట్ విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, మంజీరా హై స్కూల్ కు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కి తృతీయ బహుమతి లభించింది. సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, జిల్లా పరిషత్ హై స్కూల్ పటాన్చెరుకు ద్వితీయ బహుమతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కు తృతీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, క్రీడాకారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## అసమానతలు లేని సమాజ నిర్మాణమే స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 15(సింగిడి):** కలెక్టరేట్, ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు మువ్వన్నెల జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి ఎందరో మహనీయుల త్యాగఫలితంగానే బానిస సంకెళ్ల నుంచి భారతావని విముక్తి లభించిందని,సమాజంలో అసమానతలు నిర్మూలించటమే వారికిచ్చే నిజమైన నివాళిగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి గారు పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వివిధ చోట్ల జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ పై జాతీయ జెండాను ఎమ్మెల్యే ఎగురవేసి, జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేశారు. అనంతరం, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన స్వాతంత్ర్య వేడుకకల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు జాతీయ జెండాను ఆవిష్కరించగా,స్వాతంత్ర్య సమరయోధులను, సమాజ సేవలో ముందుకు సాగుతున్న ప్రముఖులను, ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులను ప్రత్యేకంగా సన్మానించటం జరిగింది. అన్ని సామాజిక వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని మన ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ శాఖల స్టాళ్లు ఆకట్టుకున్నాయి.

# దేశ ప్రగతికి పునరంకితమవుదాం

- అడిషనల్ కలెక్టర్ సంగీత
- కలెక్టరేట్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 15 (సింగిడి):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సముదాయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సముదాయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ సంగీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని సూచించారు. ముఖ్యంగా యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు సాగుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించిన విజన్‌కు అనుగుణంగా అడుగులు వేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయా లని ఆమె సూచించారు. ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు



**అల్వాల్, ఆగస్టు 15(సింగిడి):** అల్వాల్ సర్కిల్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు సర్కిల్లోని కాలనీలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఆర్డీవో, తహసల్దార్ ఆర్డీవో శ్యాంప్రకాష్, తాసిల్దార్ రాములు, అల్వాల్ పోలీస్ స్టేషన్లో సీఐ ప్రశాంత్ ఎగరవేశారు. పలు కాలనీలలో కాలనీ అధ్యక్షులు కాలనీవాసులతో జెండా ఎగరవేశారు

# వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

- ఉప్పొంగిన దేశభక్తి

**వికారాబాద్, ఆగస్టు 15(సింగిడి):** భిన్నత్వంలో ఏకత్వమైన నేపథ్యంలో గొప్ప, పేద, కుల, మత వయోబేధం లేకుండా దేశ ప్రతి పౌరుడు సంతోషంగా కల్మషం లేకుండా జరుపుకునే ఏకైక పండగ జెండా పండగా ఈ పండగను జిల్లా ప్రజలు 80 వ స్వాంతంత్ర దినోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ తరుణంలో వాడవాడలో మువ్వన్నెల జెండా రెప రెప లాడింది. కన్నుల పండగగా సాగిన ఈ వేడుకల్లో జాతీయ జెండా ను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. జాతీయగీతాన్ని ఆలపించి దేశ భక్తిని చాటుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్ లో స్థానిక శాసన సభ్యుడు, తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ త్రివర్ణ పాతకాన్ని ఎగురవేశారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు,



వందన సమర్పణ చేశారు. అదేవిధంగా పోలీసుల చేత గౌరవ వందనాన్ని స్వీకరిం చారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాలపై సబంధిత అధికారులు, పాఠశాల లపై ప్రధానోపాధ్యాయులు, జాతీయ పథకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అంధించిన వారికి పురస్కారాలు అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి న నేపథ్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రజలను, ప్రభుత్వాన్ని ఉద్దేశించి శాశనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలను, అమలు చెయనున్న పథకాలను వివరించారు. స్వాంతంత్ర సమరయోధుల త్యాగాలను, రాష్ట్ర సాధనలో అసువులు బాసిన అమరుల త్యాగాలను ఆయన స్మరించుకున్నారు. వారి సేవలను కొనియాయారు. సీ ఎం రేవంత్ రెడ్డి పాలనలో జిల్లా అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే లు, మున్సిపల్ చైర్మెన్లు, మాజీ ఎమ్మెల్యే లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక ప్రతి రంగూ ఓ నిజం Singidi ఆదివారం 16-8-2026

# ఎడిటోరియల్

Editorial

## హుందాతనం కోల్పోతున్న రాహుల్!

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు.. ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ.. ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే.. ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోదీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాల పైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్ధనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే.. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు.

## దేశ గృహ అవసరాల.. కల్పతరువు బయోగ్యాస్

(అసాంప్రదాయ శక్తి వనరుగా బయోగ్యాస్.)



మన గ్రహం భూమి మీద జీవం మనుగడ సాగించడానికి గాలి, నీరు, ఆహారం, శక్తి, ముఖ్య అవసరాలు. ఒక దేశం శక్తి అవసరాలను అనుసరించి ఆ ప్రదేశం ప్రగతిని కూడా అంచనా వేస్తారు. ఉదాహరణకు ప్రపంచ జనాభాలో 16% జనాభా గల భారతదేశం ప్రపంచం ఉత్పత్తి చేసే మొత్తం శక్తిలో 1.5% మాత్రమే వినియోగించుకుంటుంది. దీనికి భిన్నంగా ప్రపంచ జనాభాలో 6.25 జనాభా గల అమెరికా దేశం ప్రపంచ ఉత్పత్తి చేసే శక్తిలో 33% శక్తిని ఉపయోగించుకుంటుంది. దీనిని బట్టి మన దేశం అభివృద్ధి అమెరికా అభివృద్ధితో పోల్చి చూస్తే చాలా తక్కువ అని తెలుస్తుంది.

శక్తి వనరులను రెండు రకాలు గా విభజించవచ్చు: అవి ఒకటి సాంప్రదాయక శక్తి వనరులు రెండు అసాంప్రదాయక శక్తి వనరులు.

సాంప్రదాయక శక్తి వనరులు: ఉదాహరణకు పేడతో చేసిన పిడకలు, కట్టెలు, బొగ్గు, కిరోసిన్, పెట్రోలు సహజవాయువు బయోగ్యాస్ వగైరాలైన ఉత్పాదకాలను సాంప్రదాయక శక్తి వనరులు అంటారు. సౌర శక్తి, పరమాణు శక్తి, సముద్ర అల శక్తి, గాలిశక్తి, భూశక్తి, ఉష్ణ శక్తి వీటిని అసాంప్రదాయక శక్తి వనరులు అంటారు.

సంప్రదాయ శక్తి వనరులు: సంప్రదాయ శక్తి వనరులలో శిలాజ రకపు ఇంధనాలు, బొగ్గు పెట్రోలు సహజవాయువు ఇవన్నీ కూడా పునరుత్పత్తికి వీలులేని సృష్టి రహిత శక్తి వనరులు. కానీ కట్టెలను పునరుత్పత్తి చేయగలిగే శక్తి వనరులుగా పేర్కొంటారు. ఏ దేశానికైనా కలపను పునరుత్పత్తి చేయు గలిగే అతిపెద్ద వనరుగా భావిస్తారు. అడవులు భూభాగంలో మూడవ వంతు వ్యాపించి ఉన్నాయి .చమురు సహజవాయువులతో పోల్చితే బొగ్గు విస్తృతంగా దొరుకుతుంది. అంతర్భాగంలో మిలియన్ సంవత్సరాల కాలం నుండి మొక్కలు పతనం చెంది బొగ్గు వనరులు ఏర్పడుతున్నాయి. అయితే బొగ్గు దహన ప్రక్రియ అనారోగ్య కరణమైందే కాక చాలా అసహ్యమైనది కూడాను. ఈ దహన ప్రక్రియలో కార్బన్డయాక్సైడ్ వాయువులు గాలులోకి చేరుతాయి గత కొంత కాలం వరకు మనం పెట్రోలు పూర్తిగా ఇతర దేశాలపై నుంచి మాత్రమే దిగుమతి చేసుకుంటున్నాం. దీనికి కారణం దేశంలో చాలినంత పెట్రో వనరులను కనుగొన లేకపోవడం. అయితే తీర ప్రాంతాలలో ఈ మధ్యకాలంలో ఎన్నో పెట్రో బావులు ఉన్నట్లు కనుగొన్నారు. పెట్రోల్ తో పాటు సామాన్యంగా సహజవాయువు కూడా లభిస్తుంది. దీనిని మనం ఇప్పుడు వంట గ్యాస్ గా



వాడుతున్నాము. చమురు సహజవాయువు వనరులను పరిశోధించడానికి పెల్లికి తీయడానికి భారత ప్రభుత్వం ఒక కమిషన్ కూడా స్థాపించింది. దీనినే ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ అంటారు.

దేశ గృహ అవసరాల కల్పతరువు బయోగ్యాస్: దేశ గృహ అవసరాల కల్పతరువు బయోగ్యాస్ అని చెప్పవచ్చు. దీనిని ఒక సాంప్రదాయక ఇంధనం గానే పరిగణిస్తారు. ఇది గోబర్ గ్యాస్ తర్వాత వాడుకలోకి వచ్చిన దానిని పోలిన గ్యాస్. పశువుల పేడను ఉపయోగించి గోబర్ గ్యాస్ ను తయారు చేస్తారు. అయితే బయోగ్యాస్ మాత్రం రద్దు జీవ పదార్థాల నుండి తయారుచేస్తారు. ఉదాహరణకు గుర్రపుడెక్క, డక్ వీడు వంటి కలుపు మొక్కల నుండి కూడా ఈ గ్యాస్ ను తయారు చేయవచ్చు. అల్గే మొక్కలు ఈ గ్యాస్ తయారీలో ఎంతగానో ఉపయోగపడతాయి. బయోగ్యాసును వంట గ్యాస్ గానే కాక విద్యుత్ ఉత్పాదనలో కూడా ఉపయోగిస్తారు. ఈ బయోగ్యాస్ తయారులో మిగిలిపోయిన రద్దు పదార్థాల నుంచి మంచి నత్రజని



ఎరువులను తయారు చేస్తున్నారు. ఈ గ్యాస్ తయారీ పద్ధతి రద్దు పదార్థాలను తొలగించడానికి కూడా పాక్షికంగా ఉపయోగపడతాయి. గ్రామ ప్రాంతంలో మన దేశంలో కొన్ని వేల బయోగ్యాస్ యంత్రాలను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

బయోగ్యాస్ రంగంలో తెలంగాణ: బయోగ్యాస్ శక్తి వనరుల రంగంలో తెలంగాణలో ఇప్పుడిప్పుడే అవగాహన పెంచుకొని అసాంప్రదాయ ఇంధన వనరుల రంగంలో దృష్టి పెడుతూ కాలుష్య రహిత రంగం వైపు ముందుకెళ్తుండగా తెలంగాణ ప్రభుత్వం కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేస్తుండగా బయోగ్యాస్ వంటి రంగాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. సబ్సిడీ మీద బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకరిస్తుంది. అ సాంప్రదాయక వనరుల తో పాటు కొన్ని సంపన్న దేశాలు హైడ్రోజన్ వాయువును కూడా అసాంప్రదాయక ఇందరంగా వాడి ఇన్నర్ సేల్స్ అనే విద్యుత్ ఉత్పాదక సాధనాలకు కూడా తయారు చేస్తున్నారు. ఈ విధంగా బయోగ్యాసును వంట గ్యాస్ గానే కాక విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో విద్యుత్ ఉత్పత్తిలో ఉపయోగించి రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీరుస్తుందనడంలో సందేహం లేదు.

పందిరి: శ్రీనివాసులు.
ఎంఏ (జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజే (జర్నలిజం) పీజీడీసీజే (జర్నలిజం)
ఉస్మానియా యూనివర్సిటీ.



## అలుపెరుగని పోరాట యోధుడు గౌతు లచ్చన్న



భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది.

గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 – ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు.

బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చ్చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాధం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929–30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది.

1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు.

ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా– లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ



సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు.

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు.

1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాధం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు.

1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

–రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# ఘనంగా జనహృదయ నేత ప్రణవ్ జన్మదిన వేడుకలు

- ప్రత్యేకపూజలు, రక్తదానం నిర్వహించిన అభిమానులు



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి) :** దేశవ్యాప్తంగా శనివారం దేశ ప్రజలందరూ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటే హుజురాబాద్ నియోజకవర్గంలో పంద్రాగస్టు వేడుకలతో పాటు కాంగ్రెస్ నేత ప్రణవ్ బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నేతలు ఆయన అభిమానులు కార్యకర్తలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి ప్రణవ్ బాబు పుట్టినరోజు సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో భారీ ఎత్తున వివిధ సేవా కార్యక్రమాలు ప్రత్యేక పూజలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అపర భద్రాద్రి ఇల్లందకుంటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ప్రణవ్ బాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**కొత్తపల్లిలో.....**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి ఆధ్వర్యంలో ప్రణవ్ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొత్తపల్లిలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రణవ్ జన్మదిన వేడుకలను కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి గజమాలతో సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ప్రణవ్ బాబు పై ఒక ప్రత్యేక పాటను రాయించి సిడిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ, పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల గుండెచప్పుడు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వారికి అండగా ఉంటున్న ప్రణవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు చందారాజు శ్రీపతి నరేష్ యాట్ల సునీత అశోక్ ఒగ్గు రమేష్ మాచర్ల రాజు పొన్నగంటి విష్ణు సుజాత అశోక్ పాతకాల మౌనిక అనిల్ భక్తుల లక్ష్మణ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి దుబ్బ మల్లన్న ఆలయ దేవస్థాన చైర్మన్ ముద్దమల్ల రవి మాజీ కౌన్సిలర్లు శ్రీహరి రవీందర్ సదానందం బిక్షపతి మహిళా కాంగ్రెస్ నాయకులు తోట స్వప్న పిడుగు భాగ్యలక్ష్మి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రాజకుమార్ ఎగ్గని శ్రీనివాస్ టెంకురాల కిషోర్ దేశిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం**

ప్రణవ్ బాబు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని స్పందన బ్లడ్ బ్యాంకులో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగే శ్రీకాంత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తున్న ప్రణవ బాబు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో జీవించాలని రాబోయే రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ ఉద్యమకారుడు అన్నం ప్రవీణ్ టీపీసీసీ ప్రచార కార్యదర్శి సాయిని రవి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



- జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

**కరీంనగర్, ఆగస్టు15(సింగిడి):** కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలను కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం జాతీయ జెండాను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు దేశభక్తి గీతాలు ఆలపిస్తూ 'భారత్ మాతా కీ జై' నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభ్యున్నతి, భవిష్యత్ తరాల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యంగా దేశం పురోగమిస్తోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ జి. రమేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ప్రచార విభాగం కన్వీనర్ కటకం లోకేశ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, వివిధ మోర్చాల బాధ్యులు, మండల, నగర, జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

ఉద్యమకారులను ప్రభుత్వ వేడుకల్లో గౌరవించాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి):** దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ జమ్మికుంట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోరం జమ్మికుంట శాఖ అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం సెక్రటరీ జనరల్, జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి హాజరై మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం రావడం ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితమని అన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు సాగించిన పోరాటం, చేసిన త్యాగాల ఫలితంగానే నేడు స్వరాష్ట్రంలో స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్నామని సంజీవరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అధికారిక వేడుకల్లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి కలెక్టర్ చేతుల మీదుగా గౌరవ సూచకంగా సత్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను అధికారికంగా గౌరవించడం ద్వారా వారి పోరాట చరిత్రను భావితరాలకు తెలియజేసినట్లవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ రెడ్డి, రచ్చ గణేష్, పాతకాల ఓదేలు, రామ్ రాజబాబు, మోతే స్వామి, ఎగిత కొమురయ్య, ఏబూషి ఓదేలు, గండికోట సమ్మయ్య, రమేష్, బిట్ల శీను, పొడేటి అనిల్, మొలుగు శీను, మోతే రాజు తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్ ఠాకూర్, ప్రణవ్ జన్మదిన వేడుకలు



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి):** రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆశ్రమంలోని పిల్లలకు అన్నదానం చేశారు. అనంతరం స్వీట్స్, ఫ్రూట్స్, నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్లపెల్లి నాగరాజు మాట్లాడుతూ రాజ్ ఠాకూర్, వొడితల ప్రణవ్‌లు పేదలు, యువత, విద్యార్థులు, రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఇద్దరు నేతలు భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, సాయిని రవి, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు పూదరి రేణుక, శివకుమార్ గౌడ్, ఎండీ గౌస్, సుంకరి శ్యామ్, కుమ్మరి శ్యామ్, కొలుగూరి శ్రీకాంత్, బాబాజీ నాగరాజు, మాచర్ల వినయ్, నాగండ్ల నరేష్, పర్లపెల్లి భరత్, కట్ల రాజుతో పాటు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ జన్మదిన వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు15(సింగిడి):** తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇరుగురాల ఆనంద్ జన్మదిన వేడుకలను తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, సంఘం బలోపేతానికి ఇరుగురాల ఆనంద్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు చంటి మహేష్, లంక మనోజ్, సాయితేజ, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరించిన అధికారులు



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలో 80వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో సిఐ రామకృష్ణ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్రం సిద్ధించిందని ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవిస్తూ దేశ అభ్యున్నతి కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు రవి సంజయ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**తహసిల్దార్ కార్యాలయంలో**

జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ ఏ శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ శంకర్ మాట్లాడుతూ, ముందుగా మండల ప్రజలకు కార్యాలయ సిబ్బంది కి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వాతంత్రం సాధించడం కోసం ఎంతోమంది అమరులు బలి అయ్యారని వారి అందరి బలిదానం తోనే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని వచ్చిన స్వాతంత్రాన్ని గౌరవిస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శంకర్ సత్యనారాయణ సిబ్బంది రాజేందర్ నవీన్ తిరుపతి తో పాటు మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ లో**

జిల్లాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మల్లేశం ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ లు అర్థిదారులు వ్యాపారులు హమాలీలు కార్మికులు మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి సైకిల్ బహుకరణ



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జి అక్షర అనే విద్యార్థినికి పట్టణానికి చెందిన అట్లాస్ సైకిల్ షాప్ డీలర్ వ్యాంసాని రమేష్ నూతన సైకిల్ ను బహుకరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అక్షర అనే అమ్మాయికి సుమారు పదివేల విలువచేసే సైకిల్ ని బహూకరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, చాలా రోజుల నుండి నిరుపేద విద్యార్థినికి సైకిల్ అందించాలన్న ఆలోచన ఉందని గణతంత్ర దినోత్సవ సందర్భంగా నా కోరిక నెరవేరిందని తెలిపారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మీ పై పెట్టుకున్న మీ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జరీనా అంజుమ్ ఉపాధ్యాయులు రాజేందర్ రమేష్ స్వామి స్రవంతి అవినాష్ ఐలయ్య రేణుక సంతోష్ కుమార్ తోపాటు అనిత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట పోలీస్ సేవలకు ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్

తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల నుంచి డ్రగ్స్ నిర్మూలన

ప్రజా సేవ వరకు అంకితభావంతో సేవలు



**కరీంనగర్, ఆగస్టు 15(సింగిడి):** కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుముల నిరంజన్‌రెడ్డికి విశిష్టమైన, సుదీర్ఘ పోలీస్ సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీస్ మెడల్ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. 1989లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన నిరంజన్‌రెడ్డి, 1990లో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొలి నియామకం పొందారు. అనంతరం తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని పలు ఎదురుకాల్పుల్లో విధులు నిర్వహించారు. 1992లో మావోయిస్టుల కాల్పుల్లో గాయపడినా, ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి సేవా పతకం, ఉత్తమ సేవా పతకాలతో సత్కరించింది. 1994 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్ బలగాలకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయడంతో పాటు ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనంలో కీలక పాత్ర పోషించారు. తదుపరి ఎస్ఐగా పనిచేసిన కాలంలో పోలీస్ విధులతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. బాలల దినోత్సవ కార్యక్రమాలు, మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శారీరక, మానసిక శిక్షణ అందించడంలోనూ సేవలందించారు. 2023లో సీఐగా పదోన్నతి పొందిన అనంతరం విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేశారు. మెట్పల్లి సీఐగా విధులు నిర్వహించిన సమయంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలన, పోలీస్ శాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం సిఫారసు మేరకు భారత ప్రభుత్వం 2025 సంవత్సరానికి ఇండియన్ పోలీస్ మెడల్ ప్రకటించింది. ఇప్పటివరకు ఆయనకు 82 నగదు ప్రోత్సాహకాలు, 64 ప్రశంసా పత్రాలు, 24 ప్రత్యేక ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, తనకు ఈ పురస్కారం దక్కడంలో ప్రజలు, పోలీస్ ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది అందించిన సహకారం ఎంతో కీలకమని తెలిపారు. తన సేవా ప్రస్థానంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రణవ్ జన్మదినం సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి) :** కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డు కేశవాపురంలో సుమారు 40 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం రైతుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, నిస్వార్థంగా నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్న ప్రణవ్ బాబు భవిష్యత్తులో హుజురాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తారని రాబోయే కాలానికి కాబోయే ఎమ్మెల్యే ప్రణవ్ బాబు అని పేర్కొన్నారు. అవినీతికి దూరంగా కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతర పాటుపడుతున్న ప్రణవ బాబు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి జిల్లా నాయకులు సాయిని రవి 15వ వార్డ్ కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూనగంటి రవీందర్ మహిళా పట్టణ అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ జమ్మికుంట యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్ పాతకాల ప్రవీణ్ చెందింది నాగేంద్ర రాచపల్లి గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే మువ్వన్నెల జెండా

ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవ చేయడమే అమరవీరులకు నిజమైన నివాళి

టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి




**కరీంనగర్, ఆగస్టు 15(సింగిడి):** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా భారతదేశంలో జీవిస్తున్నామని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ టీఎన్‌జీవో కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, వ్యాపారం కోసం భారత్‌లోకి వచ్చిన ఈస్ట్ ఇండియా కంపెనీ క్రమంగా దేశ రాజకీయాల్లో జోక్యం చేసుకుని బ్రిటిష్ పాలనను విస్తరించిందన్నారు. అధిక పన్నులు, ఆర్థిక దోపిడీతో రైతులు, కార్మికులను బ్రిటిష్ పాలకులు తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. మహాత్మా గాంధీ సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గాల్లో ప్రజలను ఏకం చేయగా, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా పోరాట స్ఫూర్తిని రగిలించారని గుర్తుచేశారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్, రాణి లక్ష్మీబాయి తదితరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని అన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమం నుంచి 1947 స్వాతంత్ర్యం వరకు సాగిన పోరాటం ఎందరో అమరవీరుల త్యాగాలతోనే విజయవంతమైందని పేర్కొన్నారు. అనంతరం కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవ చేయడమే స్వాతంత్ర్య సమరయోధులకు అందించే నిజమైన నివాళి అని దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘాల నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఖర్గేను అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

బీజేపీ, ఆర్ఎస్ఎస్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి, మంత్రి అడ్లూరి, కాంగ్రెస్ నేతల డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు15(సింగిడి):** ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన ఘటనను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో శనివారం రోజున నిర్వహించిన విలేకరుల సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఖర్గేను అవమానించడం యావత్ దళిత సమాజాన్ని అవమానించినట్లేనని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దళిత, బహుజన వర్గాల పట్ల వివక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ ఘటనపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గేను అవమానించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ ఘటనపై దళిత, బహుజన సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం వంటి గొప్ప రోజున ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను అవమానించడం ద్వారా దళిత సమాజ మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, అమిత్‌షా, బీజేపీ రాష్ట్ర నాయకత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీలో ఉన్న దళిత నాయకులు, కార్యకర్తలు ఈ ఘటనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఈ ఘటనపై తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎండీ తాజ్, నిహాల్, గోపు మల్లారెడ్డి, కాంపెల్లి కీర్తికుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi


# ప్రభుత్వ ఐటీఐ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు

- ములుగు రోడ్డులో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు15(సింగిడి):** వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల నూతన భవన నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత 50 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించిన ఐటీఐకి నూతన భవనం అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే మరో 50 సంవత్సరాల పాటు విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య, శిక్షణ అందించేలా రూ.25 కోట్లు మంజూరు చేయడం గొప్ప నిర్ణయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐటీఐ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తాను నాలుగు నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశానని అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.25 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. వరంగల్‌లో నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే పరిశ్రమలు, రైల్వేలు, ఇతర సంస్థల్లో అవసరమైన నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రత్యేకంగా రైల్వే రంగంలో భవిష్యత్‌లో వచ్చే ఉద్యోగ అవకాశాలను గుర్తించి, వాటికి అవసరమైన స్కిల్స్‌ను ఐటీఐలోనే అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. నోటిఫికేషన్లు వచ్చిన సమయంలో స్థానిక యువతకు అవసరమైన అర్హత, నైపుణ్యం ఉండేలా ముందుగానే శిక్షణ అందించాలన్నారు. ఐటీఐతో పాటు పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునిక సాంకేతిక విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని నాయిని తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను అందించి, చదువు పూర్తయ్యే నాటికే ఉద్యోగానికి అవసరమైన శిక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్, మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్‌పోర్ట్, రింగ్ రోడ్, మాస్టర్ ప్లాన్ వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఐటీఐలో గతంలో చదివి శిక్షణ పొందిన సుమారు 50 వేల మంది పూర్వ విద్యార్థుల వివరాలను సేకరించి వారితో అనుసంధానం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో, వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులను సంప్రదించి కళాశాల అభివృద్ధికి వారి సహకారం తీసుకోవాలని కోరారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దాలని, ఖాళీ ప్రదేశాలను గ్రీన్ ఏరియాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అభివృద్ధి పనుల కోసం సంబంధిత శాఖలు, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తాత్కాలిక హామీలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, మౌలిక వసతులు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగించే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతోందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. ఐటీఐ నూతన భవన నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేయడం కూడా అదే దిశలో తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు.

వరంగల్ యువతకు నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించి, స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీఐని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి సురేందర్, జక్కుల రవీందర్, బోడ డిన్న, డివిజన్ అధ్యక్షులు సంగీత్ నాయకులు అంబేద్కర్ రాజు, గోల్కొండ సాంబయ్య, సృజన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య స్ఫూర్తితో నేర రహిత సమాజాన్ని నిర్మించాలి

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల పిలుపు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని అందిపుచ్చుకొని నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి జి. అఖిల మాట్లాడుతూ.. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళనకరమన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. న్యాయంపై అవగాహన కలిగి, నేరాలకు దూరంగా ఉంటూ నేర రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయిలోనే న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాల్లో సామాజిక బాధ్యతను పెంచవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ రఘురాం, సిబ్బంది సురేందర్, అంబాల దేవేందర్, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



- జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదులు, సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ. రాములు, పీపీ ఏదులాపురం శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. అక్షయ, అడిషనల్, అసిస్టెంట్ జీపీలు బల్లా మహేందర్, ఇందారపు శివకుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితవాణి, సూపరింటెండెంట్ రఘురాం, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వవుంచిన 5 క్వింటాల పిడిఎస్ బియ్యం పట్టివేత

ఒకరు అరెస్ట్



**భూపాలపల్లి, ఆగస్టు15(సింగిడి):** భూపాల పల్లి జిల్లా ఘనపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళ్తే...విశ్వసనీయ సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రవినగర్‌కు చెందిన తుర్పాటి రాజశేఖర్ వయస్సు 30 అక్రమంగా బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఆయన వద్ద నుంచి సుమారు 5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు నిందితుడు రాజశేఖర్‌ను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా పేదలకు అందే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, రవాణా చేసినా లేదా విక్రయాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

## మాజీ కౌన్సిలర్ మృతి పట్ల మాజీ మంత్రి దిగ్భ్రాంతి



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు15(సింగిడి):** వనపర్తి పట్టణంలో మాజీ కౌన్సిలర్ బండారు కృష్ణ సతీమణి మాజీ కౌన్సిలర్ బండారు సుజాత శుక్రవారం ఆకస్మికంగా మృతి పట్ల మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిత్యం స్వార్థం వీడి ప్రజాసేవకు, పార్టీ కార్యక్రమాలకు అంకితం అయిన బండారు సుజాత ఆకస్మికంగా గుండె పోటుకు గురై మరణించడం నన్ను తీవ్రంగా కలచివేస్తుందని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం తెలిపారు. బండారు కృష్ణ, సుజాత ప్రజాసేవకు అంకితమైన విధానం భావితరాలకు ఆదర్శంగా నిలిచేవిధంగా ఉన్నదని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, విష్ణు సాగర్, జోహెబ్ హుస్సేన్, డానియల్, ఇమ్రాన్ అలీ, చిట్యాల రాము, ఖాదర్, మహేష్, సంతోష్, రాము ఉన్నారు

## ఎంసీసీ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ జెర్సీల ఆవిష్కరణ



**చింతపల్లి, ఆగస్టు15(సింగిడి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంసీసీ క్రికెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే నాలుగు జట్ల జెర్సీలను కర్మన్‌ఘాట్ ధాన్యాంజనేయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నల్ల రఘుమారెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ క్రికెట్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మోర వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఎండి. జాఫర్, ప్రధాన కార్యదర్శి గోవిందు ప్రసాద్, సహాయ కార్యదర్శి గోవిందు శివ, శ్రీ వెంకటేశ్వర స్టీల్స్ టీమ్ ఫ్రాంచైజ్ గునుకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు తగ్గిస్తే భూపాలపల్లి మున్సిపాలిటీ స్తంభిస్తుంది

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి
- పాత పద్ధతిలోనే పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్



**భూపాలపల్లి, ఆగస్టు15(సింగిడి):** భూపాలపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న 152 మంది పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను తగ్గించే చర్యలను బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తీవ్రంగా ఖండించారు. కార్మికులకు పాత పద్ధతిలోనే పూర్తి వేతనాలు చెల్లించాలని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ..

**కౌన్సిల్ తీర్మానాన్ని గౌరవించాలి**

జిఓ నెం. 69 ప్రకారం వేతనాలు తగ్గించాలని హైదరాబాద్ నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాత పద్ధతిలోనే జీతాలు చెల్లించాలని మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. కౌన్సిల్ తీర్మానాన్ని పక్కనబెట్టి ఉన్నతాధికారుల ఆదేశాల నెపంతో వేతనాలు కోత విధిస్తామనడం సమంజసం కాదన్నారు.

**కార్మికులపై తీవ్ర ఆర్థిక భారం**

జీతాల్లో రూ. 1,000 నుండి రూ. 4,900 వరకు కోత విధిస్తే కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్న కాలంలో వేతనాలు పెంచాల్సింది పోయి తగ్గించడం దారుణమన్నారు.

**ఆగస్టు 14 వచ్చినా జీతాల్లేవు**

నెలంతా కష్టపడి పనిచేసిన కార్మికులకు ఈ నెల 14వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోవడాన్ని తప్పుపట్టారు.

**తక్షణ చర్యలకు డిమాండ్**

మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కౌన్సిల్ తీర్మానానికి ర్యాటిఫికేషన్ తీసుకురావాలి. 152 మంది కార్మికులకు పాత పద్ధతిలోనే పూర్తి వేతనాలు విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం ఉన్న నేపథ్యంలో, సాయంత్రంలోగా కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. లేనిపక్షంలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా వంటి అత్యవసర సేవలు నిలిచిపోతాయని, కార్మికులకు అండగా నిలిచి భూపాలపల్లి మున్సిపాలిటీని స్తంభింపజేసేలా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పారమిత విద్యాసంస్థల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- జాతీయ పతాకావిష్కరణ చేసిన చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు




**కరీంనగర్, ఆగస్టు15(సింగిడి):** నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల, హెరిటేజ్, ఎక్స్‌ప్లోరికా విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాదరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు, నృత్యాలతోపాటు విద్యార్థుల కవాతు ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్‌రావు, వినోద్‌రావు, రాకేశ్, ప్రాచి, వి.యు.యం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, గోపీకృష్ణ, శర్మిష్ఠ, శ్రీకర్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అవయవ దానంతో.. మరొకరికి కొత్త జీవితం

సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు15(సింగిడి):** మనం మరణం తర్వాత లేదా బ్రతికుండగానే అవసరమైన వారికి అవయవాలు దానం చేయడం మరొకరికి కొత్త జీవితాన్ని ఇస్తుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని తెలంగాణ అవయవ దాన సంఘం రాష్ట్ర నాయకుడు ఆదామ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ గుండె, కిడ్నీ, కాలేయం, కళ్ళు, ఊపిరితిత్తులు వంటి అవయవాలు దానం చేయవచ్చని, మనం బ్రతికుండగానే రక్తదానం చేస్తే ఒక ప్రాణం కాపాడినట్లని, అవయవ దానం చేస్తే 8 మంది ప్రాణాలు కాపాడినట్లని చెప్పారు. మెదడు చనిపోయిన తర్వాత కూడా అవయవాలు 6 నుండి 8 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఆదం రాజు కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవి జన జ్వాల, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ షాష, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, జితేందర్, చిన్న రాములు, కొమ్ము కేశవ్, రాధాకృష్ణ, భగవంతు, గోపాలకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా -- ప్రతి ఇంటా జాతీయ జెండా



**మిర్యాలగూడ ఆగస్టు15(సింగిడి):** ప్రతి ఇంత జాతీయ జెండా ఎగరాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ అన్నారు శుక్రవారం భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఫ్లై ఓవర్ నుండి రౌండ్ చౌరస్తా వరకు పట్టణ ప్రజలు విద్యార్థిని విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ దేశ సమగ్రతకు సార్వభౌమాధికారానికి హాని పెట్టాలని కానీ విదేశీ సొమ్ముతో ఈ దేశం లో అరాచకం చేయాలని చూసే విచ్చిన్న శక్తులు ఎవరైనా సరే వారికి భారత ప్రభుత్వం ఈ దేశ యువత సరైన బుద్ధి చెబుతారని అన్నారు కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు లక్ష్మీ నరసయ్య . బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు గోలి మధుసూదన్ రెడ్డి . నల్గొండ జిల్లా ఇన్చార్జ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మైల నరసింహా, మిర్యాలగూడ వన్ టౌన్ టూ టౌన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బంటుగిరి పెద్దబోయిన వెంకటేశ్వర్లు కొంగరి వెంకటరమణ మూల రాజిరెడ్డి శ్రీకాంత్ సీనియర్ నాయకులు బంటు సైదులు రేపాల పురుషోత్తం రెడ్డి ఎడ్ల రమేష్ తుమ్మలపల్లి హనుమంత్ రెడ్డి కన్మంత్ రెడ్డి అశోక్ రెడ్డి కొండేటి సరిత చిలుకూరి రమాదేవి శ్యామ్ము,న్సిపల్ ఫ్లోర్ లీడర్ వెలుగు ఇందిరా నాగరాజ్ చిల్లంచర్ల అభి బంటు యాదగిరి గోనె కవిత రెడ్డి మండల సోములు మంద శివ మోదల అశోక్ మునగాల శివ చిలుకూరి వెంకటేశ్వర్లు శశి పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్

హనుమాన్ దేవస్థానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

20లక్షల నిధులతో నూతన కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ



**జమ్మికుంట, ఆగస్టు 15 (సింగిడి):** దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పడమే కాదు దానికి అనుగుణంగా అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టేలా కృషి చేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..హుజురాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్నటువంటి హనుమాన్ దేవాలయానికి ప్రత్యేక నిధుల(ఎస్డీఎఫ్) ద్వారా 20లక్షలు కేటాయించిన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగా శనివారం రోజున ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన కమ్యూనిటీ హాల్ భవనానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఆలయ కమిటీ ఏర్పడిన వెంటనే ఇంచార్జి ప్రణవ్ కు వినతి పత్రం అందజేయడం జరిగిందని, దానికి ఇచ్చిన మాట ప్రకారం నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, నియోజకవర్గంలో ఉన్న అన్ని దేవాలయాలకు నిధులు కేటాయించి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ఆలయ చైర్మెన్ శంకర్, కమిటీ సభ్యులు, ఈఓ సుధాకర్, పట్టణ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శ్‌నగర్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జాతీయ జెండాను ఆవిష్కరించిన, కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అంజన్ కుమార్



**కరీంనగర్, ఆగస్టు 15(సింగిడి):** కరీంనగర్ పట్టణంలోని 26వ డివిజన్ సుభాష్‌నగర్, ఆదర్శ్‌నగర్, ఆర్యసమాజ్, సుభాష్ చంద్రబోస్ విగ్రహం, సుభాష్‌నగర్ చౌరస్తా, వెల్డింగ్ అసోసియేషన్ తదితర ప్రాంతాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య పోరాటం ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఆనకట్టలు, పరిశ్రమలు, విద్యారంగంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు దేశ ప్రగతికి బలమైన పునాదులు వేశాయని తెలిపారు. ప్రజలంతా దేశ సమగ్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బరువు తగ్గడంతోపాటు

# రక్తం పెరుగుతుంది..

### ఈ సీజన్‌లో అన్ని వయస్సుల వారు తాగాల్సిన అద్భుతమైన డ్రింక్






ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం అనేక మార్గాలను అన్వేషిస్తున్న వారికి బార్లీ గింజలు ఒక అద్భుతమైన పరిష్కారం. ముఖ్యంగా ఉదయమే బార్లీ జావను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల అనేక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు.

బార్లీ కేవలం ఒక ధాన్యం మాత్రమే కాదు.. అది పోషకాల గని అని.. ప్రతిరోజూ బార్లీ జావ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొంటున్నారు. వాస్తవానికి ఆధునిక జీవనశైలిలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు షుగర్, బీపీ, కొలెస్ట్రాల్.. బార్లీ గింజలు ఈ మూడింటినీ అదుపులో ఉంచడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. వీటిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల రక్తపోటును సమర్థవంతంగా నియంత్రిస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే, బార్లీలోని పీచుపదార్థాలు (ఫైబర్) కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

బార్లీ జీర్ణవ్యవస్థకు కూడా మేలు చేస్తుంది. అధిక పీచుపదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, మలబద్ధకాన్ని నివారిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలకు సహాయపడతాయి. ఉదయమే బార్లీ నీరు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థ పదార్థాలు, విషపదార్థాలు మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. ఇది శరీరాన్ని శుభ్రపరచి, మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. పెద్దపేగును శుభ్రపరచడం ద్వారా కోలన్ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు రాకుండా కూడా రక్షణ కల్పిస్తుంది.

బరువు తగ్గాలనుకునేవారికి బార్లీ వాటర్ ఒక సహజసిద్ధమైన మిత్రుడు. ఇది శరీర మెటబాలిజంను క్రమబద్ధీకరిస్తుంది. పీచుపదార్థాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగించి, అతిగా తినకుండా నిరోధిస్తాయి. ఫలితంగా, బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

బార్లీలో కేవలం పీచు, పొటాషియం మాత్రమే కాకుండా విటమిన్ ఎ, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉన్నాయి. విటమిన్ ఎ కంటిచూపును దీర్ఘకాలం పాటు పదిలంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఐరన్ రక్తహీనతను నివారిస్తుంది, రక్తకణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది. కాల్షియం, ఫాస్ఫరస్ ఎముకలను మరింత బలంగా చేస్తాయి. ఎముకల సాంద్రతను పెంచుతాయి. అంతేకాకుండా, బార్లీ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వివిధ వ్యాధుల నుండి కాపాడుతుంది.

బార్లీ జావాను తయారు చేయడం చాలా సులభం. ఒక గుప్పెడు బార్లీ గింజలను ఒక లీటరు నీటిలో వేసి 10 నుండి 15 నిమిషాలు బాగా మరిగించాలి. ఆ తర్వాత ఆ నీటిని వడగట్టి ఒక గ్లాసులోకి తీసుకోవాలి. దీనికి సగం నిమ్మకాయ రసం, ఒక చెంచా తేనె కలిపి ప్రతిరోజూ ఉదయం పరగడుపున తాగాలి. లేదా బార్లీ పొడి.. రెండు స్పూన్లను నీటిలో కలిపి మరిగించి తీసుకోవచ్చు..

ఈ పానీయం శరీరాన్ని రిఫ్రెష్ చేయడమే కాకుండా పైన పేర్కొన్న అన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ సాధారణ అలవాటు మీ రోజువారీ ఆరోగ్యానికి అద్భుతమైన మార్పును తీసుకువస్తుంది.

## అమెజాన్ ప్రైమ్ డే సేల్ తేదీ ఖరారు..
## మెంబర్‌షిప్ ధర తగ్గింపు






ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ డే సేల్ కు సిద్ధమవుతోంది. జులై 4 నుంచి జులై 6 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనుంది. కేవలం ప్రైమ్ యూజర్ల కోసమే ఏటా నిర్వహించే ఈ సేల్‌లో ఎక్స్‌క్లూజివ్ డీల్స్, భారీ ఆఫర్లను అందించనుంది. ఆఫర్ల వివరాలు ఇంకా ప్రకటించలేదు. సేల్‌కు కొన్ని రోజుల ముందే ఈ వివరాలను కంపెనీ వెల్లడించనుంది.
జులై 4న రాత్రి 12 గంటలకు సేల్ ప్రారంభమవుతుంది. జులై 6న రాత్రి 11.59 నిమిషాలకు ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సేల్‌లో వన్‌ప్లస్, శాంసంగ్ బ్రాండ్లకు సంబంధించిన 500 కొత్త ప్రొడక్ట్‌లపై భారీ ఆఫర్లు ఉంటాయని కంపెనీ ప్రకటించింది. ఎకో స్మార్ట్ స్పీకర్స్, అలెక్సా, ఫైర్ టీవీలపై 45 శాతం వరకు ఆఫర్లు అందించనుంది. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు హోల్డర్లకు అదనంగా 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తుంది. అమెజాన్ ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు హోల్డర్లకు 5 శాతం క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది.

**తగ్గిన ప్రైమ్ మెంబర్‌షిప్ ధర**
ప్రైమ్‌డే సేల్ 10వ ఎడిషన్ సందర్భంగా కొత్తగా ప్రైమ్ మెంబర్‌షిప్ తీసుకునే వారి కోసం ఆఫర్‌ను ప్రకటించింది. ప్రస్తుతం స్టాండర్డ్ ప్రైమ్ మెంబర్‌షిప్ ఏడాది ప్లాన్ ధర రూ.1499 ఉండగా.. రూ.999కి తగ్గించింది. ప్రైమ్ లైట్ సబ్‌స్క్రిప్షన్ రూ.799 నుంచి రూ.599కే అందిస్తోంది. కేవలం షాపింగ్ డిస్కౌంట్‌ల కోసం అందించే ఎడిషన్ ప్లాన్‌ను రూ.399 నుంచి రూ.299కి తగ్గించింది. త్వరగా ప్రొడక్ట్‌లను తెలుసుకునేందుకు ఏఐ టూల్స్‌నూ ఆఫర్ చేస్తోంది. కొనుగోలుదారులకు అమెజాన్ పే లేటర్ సదుపాయం కూడా అందిస్తోంది.



## మారుతీ, టాటా బాటలోనే కియా..
# కార్ల ధరలు పెంపు

డాలర్‌తో పోలిస్తే రూపాయి అస్థిరత, ముడిసరకు ధరలు భారంగా మారడంతో ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీలు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. దీంతో తమ కార్ల ధరలను పెంచేస్తున్నాయి. ప్రముఖ కార్ల కంపెనీలైన మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ, హ్యూందాయ్ వంటివి ఇప్పటికే ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. తాజాగా ఆ జాబితాలోకి కియా కూడా చేరింది. జులై 1 నుంచి తన మోడళ్ల ధరను 2 శాతం వరకు పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ముడి సరకుల ఖర్చు, నిర్వహణ వ్యయం పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది.
ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ , విద్యుత్ వాహన సెగ్మెంట్‌లోని మోడళ్లు, వేరియంట్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని కియా పేర్కొంది. పెరుగుతున్న తయారీ ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ పెంపు అనివార్యంగా మారిందని తెలిపింది. పెద్ద మొత్తంలో భారాన్ని కంపెనీ భరిస్తూ.. వినియోగదారులపై ఆ ప్రభావం పడకుండా స్వల్ప మొతాదులోనే ధరల పెంపు చేపడుతున్నట్లు ప్రకటించింది. దేశీయంగా సెల్టోస్, సోనెట్, కరెన్స్, క్లావిస్, సైరోస్, కార్నివాల్‌తో పాటు ఈవీ6, ఈవీ9 మోడళ్లను కంపెనీ విక్రయిస్తోంది. టాటా మోటార్స్, బీఎండబ్ల్యూ ఇండియా, మెర్సిడెజ్ బెంజ్, నిస్సాన్ జులై నుంచి కార్ల ధరలు పెంచుతుండగా.. మారుతీ సుజుకీ జూన్ 1 నుంచే తన మోడళ్ల ధరలను రూ. 30 వేల వరకు పెంచిన విషయం తెలిసిందే.

## కృత్రిమ మేధస్సుపై
# శిక్షణ తరగతులు



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ వారిచేత చేపట్టిన అన్న - అక్క మెంటర్ షిప్ కార్యక్రమములో భాగంగా డిగ్రీ చివరి సంవత్సరపు విద్యార్థిని, విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విభాగంలో రెండు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి శిక్షకులుగా పి. అవనికేత్ సహ ఆచార్యులు సింగపూర్ కిట్స్ కళాశాల నుండి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఓదెలు కుమార్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు యొక్క పాత్రను వివరించారు. కృత్రిమ మేధస్సు అనేది మానవులలో ఉండే ఆలోచనా శక్తి, నేర్చుకునే సామర్థ్యం మరియు సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను కంప్యూటర్లు లేదా యంత్రాలు ప్రదర్శించేలా చేసే ఒక అధునాతన సాంకేతికత అని అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి. కిరణ్ కుమార్, డా. ఎం. శామల, ఎల్. రవీందర్, డా. ఎన్. శ్రీనివాస్, డా.సి. రాజకుమార్, డా. మాధవి, కె. ఉమాకిరణ్ , పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మమత, డా.పి. సుష్మ , డా. పి. రవిప్రకాశ్ రావు, రమేష్, ప్రశాంత్ , సాయికుమార్, అరుణ్ రాజ్, డా. పి. స్వప్న, దీనా, శ్రీకాంత్, అధ్యాపకేతర సిబ్బంది తిరుపతి, రఘు, శ్రీలత, గౌరమ్మ, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
16-8-2026

## గిన్నిస్ ఘనతకు మరో గౌరవం
### డాక్టర్ గుంటి పిచ్చయ్యకు జాతీయ పురస్కారం




**హుజుర్నగర్ (మఠంపల్లి), (సింగిడి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన స్వాతంత్ర్య వారోత్సవాల్లో భాగంగా జాతీయస్థాయి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన కళాకారుడు డాక్టర్ గుంటి పిచ్చయ్యకు ప్రతిష్ఠాత్మకమైన భారతీయ కళారత్న జాతీయ పురస్కారం లభించింది. గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించడంతో పాటు కళారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న ఎన్‌టీఆర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి చేతుల మీదుగా డాక్టర్ గుంటి పిచ్చయ్యకు శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపిక, పూలమాల అందజేశారు. తన కళా ప్రతిభకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం పట్ల డాక్టర్ గుంటి పిచ్చయ్య ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది, కళాకారులు, సామాజిక వేత్తలు, స్థానికులు ఆయనను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు, కళా ప్రదర్శనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## జూరాల పాఠశాలలో ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ



**అమరచింత, (సింగిడి):** జూరాల ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం అందించిన ఒక జత పాఠశాల దుస్తువులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుడిసె నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు. వార్డు మెంబరు రాజు, మహిముద్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్, వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. భానుప్రియ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మొగిలమ్మ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు దుస్తువులు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, ఉచిత యూనిఫామ్‌లు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విద్యార్థులకు సూచించారు. పాఠశాల యాజమాన్యం తరఫున ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

### చంద్ర నాయక్ తాండా పంచాయతీ
## భవనానికి 3 గుంటల భూమి దానం
### ఎన్నికల హామీ మేరకు దాతల సహకారం




**అమరచింత, (సింగిడి):** చంద్ర నాయక్ తాండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం మొత్తం 3 గుంటల పట్టా భూమిని దాతలు గ్రామ పంచాయతీకి దానంగా అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి అవసరాన్ని గుర్తించి దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్ తల్లి జయమ్మ 2 గుంటల భూమి వి. రమేష్ నాయక్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు – 1 గుంట భూమి దానంగా ఇచ్చారు. గ్రామ పంచాయతీ పేరుతో భూమి రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం, బుధవారం తహసీల్దార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ రవి కుమార్ సంబంధిత పట్టాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ. సుచిత్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్, 3వ వార్డు సభ్యులు కుర్మా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి విలువైన భూమిని దానం చేసిన జయమ్మ, వి. రమేష్ నాయక్ గారికి సర్పంచ్ కృష్ణ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం దాతలు చేసిన ఈ సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.

### నందిమల్ల ప్రాథమిక పాఠశాలలో
## ఉచిత యూనిఫామ్ పంపిణీ
### మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టిన సర్పంచ్ రాజేందర్ రెడ్డి

**అమరచింత, (సింగిడి):** నందిమల్ల ప్రాథమిక పాఠశాలలో ఉచిత యూనిఫామ్ పంపిణీ కార్యక్రమం బుధవారం అధికారులు ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు. వార్డు సభ్యులు వెంకటేష్, మల్లేష్, కురుమన్న, అశోక్, గ్రామ పెద్దలు, యువత, ఏ ఏ పీ సి చైర్మన్ ఆశమ్మ, మౌనిక, బీసిరెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం లేని విషయాన్ని గమనించిన సర్పంచ్ రాజేందర్ రెడ్డి, విద్యార్థుల అవసరాన్ని గుర్తించి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత మరియు సౌకర్యాల పట్ల ఆయన చూపిన శ్రద్ధ అభినందనీయమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. ఈ కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేశారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత మరియు ప్రజాప్రతినిధులు అందిస్తున్న సహకారానికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## గూడూరు లో ఎక్స్ రే టీబీ వైద్య శిబిరం



**కమలాపూర్ ,(సింగిడి):** టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఫేస్ –2 లో భాగంగా మండలంలోని గూడూర్ గ్రామంలో గురువారం ఎక్స్ రే, టీబీ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల పైబడిన వ్యక్తులు, వృద్ధులు, ధూమపానం, మద్యపానం, హెచ్ఐవి, బాధితులు బి ఎం ఐ తక్కువ ఉన్నవారు టీబీ తో బాధపడి స్వస్థత పొందిన వారు ,వారి సన్నిహితులకు పరీక్షలు నిర్వహించారు. 68 మందికి ఎక్స్‌రే తో పాటు తెమడ పరీక్షలు నిర్వహించారు. టిబి వ్యాధి నివారణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ –టీబీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పల్లె దవఖాన వైద్యురాలు మాధవి, సి హెచ్ ఓ మాధవరెడ్డి, హెచ్ ఈ ఓ రవీందర్, ఎస్ టి ఎస్ శ్రీనివాస్, రేడియోగ్రాఫర్లు మహేష్ ,సదానందం, సిద్ధార్థ, ల్యాబ్ టెక్నీషియన్ చందు, టిబి నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్ రవీందర్, ఏ ఎన్ ఎం లు రమాదేవి, లావణ్య, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తం కావాలి
### నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లో తక్షణ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి: తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య



**నల్లబెల్లి, (సింగిడి):** నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లో డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య కోరారు. డెంగ్యూ వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నప్పటికీ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ఆశించిన స్థాయిలో చేపట్టకపోవడం ఆందోళనకరమన్నారు. గ్రామాల్లోని డ్రైనేజీల్లో మురుగునీరు నిలిచిపోవడం, ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఏర్పడటంతో దోమల వృద్ధి అధికమవుతోందని తెలిపారు. దీంతో ప్రజలు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు నమోదవుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు.

డ్రైనేజీల శుభ్రతపై దృష్టి

నల్లబెల్లి, ఖానాపురం మండలాల్లోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని బట్టు సాంబయ్య కోరారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీటిని తొలగించి, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలు

దోమల నియంత్రణ కోసం డెంగ్యూ ప్రభావిత ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు. నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు చేపట్టి దోమల ఉత్పత్తిని అరికట్టాలని తెలిపారు. పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు. అలాగే గ్రామాల్లో డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నుంచి రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అన్ని గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

వరంగల్ జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి నల్లబెల్లి, ఖానాపురం మండలాలతో పాటు నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని బట్టు సాంబయ్య విజ్ఞప్తి చేశారు. డెంగ్యూ కారణంగా ప్రాణనష్టం సంభవించే పరిస్థితి రాకముందే అధికారులు అప్రమత్తం కావాలని కోరారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, డెంగ్యూ వ్యాప్తిని అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# 23న చలో హైదరాబాద్..
## పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు ఉద్యమం





**పెబ్బేరు (సింగిడి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. వనపర్తి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, మోడల్ స్కూల్, జెడ్పీ హెచ్ఎస్ పెబ్బేరు, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ జీవితమంతా ప్రభుత్వ సేవకు అంకితం చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించడంలో పెన్షన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సీపీఎస్ విధానం కారణంగా ఉద్యోగుల భవిష్యత్ భద్రతపై ఆందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు తమ భవిష్యత్తుతో పాటు కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయని నాయకులు తెలిపారు. ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఉద్యోగి తనవంతు బాధ్యతగా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. 'నేడు మనం వేసే అడుగే.. రేపటి మన భవిష్యత్తుకు బాట' అని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీవో రోజా, ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, జెడ్పీ హెచ్ఎస్ పెబ్బేరు ప్రధానోపాధ్యాయులు నరసింహగౌడ్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర బాధ్యులు మోహన్‌బాబు, చిన్నరాములు, నరసింహనాయుడు, దయానందు, దుర్గాప్రసాద్, రవి, భాస్కర్‌రెడ్డితో పాటు వివిధ సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పలిమెల మండలంలో కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృత పర్యటన
## పలు అభివృద్ధి పనుల పరిశీలన







**మహదేవపూర్(సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా అటవీ మండలమైన పలిమెల మండలంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృతంగా పర్యటించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను , ప్రభుత్వ సంస్థలను ఆయన పరిశీలించారు. పనుల పురోగతి నాణ్యత ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానమంత్రి కృషి సంచాయి కింద జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫామ్ పాండ్ లను ఆయన పరిశీలించారు జిల్లాలోని మూడు మండలాల పరిధిలో 21 గ్రామపంచాయతీలకు 214 ఫామ్ పాండ్ లు మంజూరు కాగా ఇప్పటివరకు 157 పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఒక్కొక్క ఫామ్ పాండ్ కు 1 కోటి 30 లక్షల అవుతుందని, ఫామ్ పాండ్ ల నిర్మాణంలో భూపాలపల్లి జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఫామ్ పాండ్ ల ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు సాగునీటి లభ్యత భూగర్భ జలాల పెంపు తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ పాఠశాల, కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం సందర్శించారు. నూతనంగా నిర్మించిన ఇంటర్మీడియట్ కళాశాల భవనాన్ని పరిశీలించి అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేసి కళాశాల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్త్రీ నిధి ద్వారా 7 లక్షల రుణాల చెక్కులతో పాటు మహిళా సంఘాలకు 7 లక్షల 50 వేల రుణాలు నాలుగు సంఘాలకు అందజేశారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తయారుచేయించిన ఉచిత యూనిఫాంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. దమ్ము గ్రామంలో మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కౌజు పిట్టల పెంపకం కేంద్రాన్ని సందర్శించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారు చేపడుతున్న ఉపాధి ఆదాయ మార్గాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు భయం ఉపాధి కార్యక్రమాలను విస్తరించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్, పెయింటింగ్ తదితర పనులను దళిత గర్జన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాన రహదారి నుండి ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రహదారిని వెడల్పుగా సౌకర్యవంతంగా నిర్మించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాల ఆసుపత్రిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులు నిర్ణిత గడువులో నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యేల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అధికారుల ఆదేశించారు. ఈ పర్యటనలు స్థానిక సంస్థల దినోత్సవం కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో రవీందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, తహసిల్దార్ రాజేశ్వరరావు, డిపిఎం రవి, పి ఎం కె ఎస్ వై ప్రాజెక్టు అధికారి సతీష్ రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ మహేశ్వరి తో పాటు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



### ఆధునిక సదుపాయాలతో
## యూనియన్ బ్యాంక్ బోధన్ బ్రాంచ్ పునఃప్రారంభం

**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ పట్టణంలో ఆధునిక సదుపాయాలతో నూతనంగా తీర్చిదిద్దిన బోధన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొయిన్ బ్రాంచ్ ను హైదరాబాద్ జోనల్ హెడ్ అండ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్రబాబు గురువారం పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, రైతులు, స్వయం ఉపాధిదారులు, ఉద్యోగులు, సామాన్య ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సౌకర్యవంతంగా అందించడంతో పాటు రుణాల ద్వారా ఆర్థికంగా అండగా నిలవడమే తమ బ్యాంకు లక్ష్యమని ఆయన తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారస్తులకు రుణ మంజూరు పత్రాలను అందచేశారు ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డీజీఎం అండ్ రీజినల్ హెడ్ కె. అరుణ సవిత, బోధన్ మొయిన్ బ్రాంచ్ మేనేజర్ ఆశిష్ సింగ్ చౌహాన్, డిప్యూటీ మేనేజన్ అనుజ, బోధన్ తాలుకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, బ్యాంకు సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

### అక్రమంగా పెట్టిన కేసును
## విరమించుకోవాలని
## పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం

**కోడేరు (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామ సర్పంచ్ కాజా అన్వర్ బేగం పై పెట్టిన అక్రమ కేసును విరమించుకోవాలని గురువారం నాడు పోలీస్ స్టేషన్లో బీ ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ వర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. వినతి పత్రం అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూ రెడ్డి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నర్సాయిపల్లి గ్రామంలో వరి ధాన్యముకొనుగోలు కేంద్రాన్ని ఆ గ్రామ సర్పంచ్ ఖాజా అన్వర్ బేగం ప్రారంభించిన అందులకు ఆమెపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి గ్రామ ప్రథమ పౌరురాలు వరి ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం తప్ప అని ప్రశ్నించారు సర్పంచ్ తో పాటు వరి ధాన్యము కొనుగోలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న వార్డు మెంబర్ల తో పాటు 12మంది పై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రూ ఖాజా బేగం పైన పెట్టిన కేసును వెనక్కి తీసుకోకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమా లు చేపడతామని హెచ్చరించారు ప్రజల కోసం రైతుల కోసం చేసిన కార్యక్రమమని ఆమె సొంత కార్యక్రమం కాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అరాచకాలు చేసే ఇకనుండి సాగ వని ఆయన మండిపడ్డారు . కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ బి ఆర్ ఎస్ మండల కార్యదర్శి రాజా వర్ధన్ రెడ్డి మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్ బా వాయిపల్లి సర్పంచ్ పరశురాములు తీగలపల్లి గ్రామ సర్పంచ్ దేవరపాగ సురేష్ ఎతం గ్రామ సర్పంచ్ ఎత్తం గ్రామ బి ఆర్ ఎస్ సురేష్ రెడ్డి మాజీ సర్పంచ్ శివారెడ్డి నర్సాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అన్వర్ పాషా జనంపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు శేసిరెడ్డి కోడేరు గ్రామ పార్టీ అధ్యక్షులు డేగ శ్రీశైలం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కొ మీరే మాసయ్య నర్సాయిపల్లి మాజీ గ్రామ సర్పంచ్ సత్యం బిఆర్ఎస్ నాయకులు బిచ్చారెడ్డి మాజీ ఎంపిటిసి బాలు నాయక్ వివిధ గ్రామాల నుండి వచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

### పెబ్బేరు ప్లాస్టిక్ వ్యర్థాల కేంద్రాన్ని
## పరిశీలించిన అదనపు
## కలెక్టర్ ఖిమ్యా నాయక్
### నిర్దేశిత గడువులోగా కేంద్రం పనులు పూర్తి చేయాలి
### పర్యావరణ పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి



**పెబ్బేరు (సింగిడి):** పెబ్బేరు పట్టణంలోని ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని, మౌలిక వసతుల ఏర్పాటును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి జాప్యం లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్రానికి అవసరమైన ఫెన్సింగ్ పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ, డీఆర్‌డీఏ, పెబ్బేరు మున్సిపల్ కమిషనర్, ఏఈ పంచాయతీరాజ్), సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వెదురు సాగు
## అదనపు ఆదాయం
### కలెక్టర్ రాహుల్ శర్మ



**మహాదేవపూర్ (సింగిడి):** రైతులు సాంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగు నుంచే పట్టి అదనపు ఆదాయాన్ని పొందాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మహాదేవపూర్ మండలం సూరారంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని ఆయన పరిశీలించి మొక్కల పెంపకం నిర్వహణ పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలిక లాభాలను అందించే ఆదాయం వనరుగా నిలుస్తుందని, రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతుందని సుమారు 70000 వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఇప్పటికే 1200 మంది రైతులు వెదురు సాగు కోసం గుర్తించినట్లు 15 గుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేసినట్లు ఆయన వివరించారు. వెదురు సాగు చేసే రైతులకు విభిజి రాంజీ పథకం ద్వారా నిర్వాహన ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. నర్సరీ సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలు జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్, తోపాటు స్థానిక సర్పంచ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యతో పాటు
## మెరుగైన భోజనం వసతులు
### జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్

**మహాదేవపూర్ (సింగిడి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం వసతులు అందేలా అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సంక్షేమ అధికారి నాగసాగర్ అన్నారు. గురువారం జిల్లాలోని మేడిపల్లి, మహాదేవపూర్, కాలేశ్వరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించి విద్యా ప్రమాణాలు , వసతులు, పాఠశాలల నిర్వహణను పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మహాదేవపూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆయన భోజన నాణ్యత అమలు చేస్తున్న కామన్ వెనుక విద్యార్థుల నుండి అభిప్రాయాలు సేకరించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన ఆయన విద్యార్థుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని విద్యార్థులందరూ సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

### కాంగ్రెస్ పార్టీ మండల
### అధ్యక్షుడిగా కట్కం అశోక్



**మహాదేవపూర్ ,(సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా సీనియర్ నాయకుడు కట్కం అశోక్ నియమితులయ్యారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నూతన మండల అధ్యక్షుల జాబితాను విడుదల చేయగా అతని పేరు వెలువడింది. నిస్వార్థ నాయకుడిగా ఎదిగిన అతనికి మండల పార్టీ అధ్యక్ష పదవి రావటంతో కార్యకర్తలు, అభిమానులు ఆనందం వెల్లుబుచ్చుతున్నారు. తనపై నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షునిగా నియమించిన మంత్రి శ్రీధర్ బాబు, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కష్టపడ్డా ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పదవులు లభిస్తాయి..

## ప్రజాసేవలో ముందుండాలి. చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** కాంగ్రెస్ పార్టీ గెలుపులో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లడానికి ప్రతి వార్డుల నుండి అధ్యక్షులను, కమిటీని వెన్నుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే మరిపెడ మున్సిపాలిటీ లోని ఎనిమిదో వార్డ్ అధ్యక్షులుగా కామసాని బుచ్చిరెడ్డి, 9వ వార్డు గంధసిరి సోమయ్య, 14 వ వార్డ్ అధ్యక్షులుగా రెంటాల యాకయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పీసీసీ అబ్జర్వర్ హవీజ్ ఖాన్ కలిసి పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పానుగోతు రాంలాల్, వైస్ చైర్ పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు మెరుగు రాము, జాటోతు సురేష్, తిరుపతి, నీలా లచ్చిరామ్, జియో రమేష్, మాం డన్ కాంతమ్మ కరణ్ సింగ్, పానుగోతు రాములు, కో ఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న, షేక్ అజీజ్ పాషా. కాంగ్రెస్ పార్టీ నాయకులు గంధసిరి అంబరీష, షేక్ తాజోద్దీన్, మహ్మద్ అప్సర్, షేక్ అఫ్జల్, అలువాల ఉపేందర్ ప్రజాపతి, దేవరశెట్టి లక్ష్మినారాయణ, గంధసిరి బిక్షపతి, కారంపూడి ఉపేందర్, పడిదం రాధిక గుగులోత్ లచ్చిరామ్, కరణ్ సింగ్, గుండగాని వెంకన్న, రవికాంత్, సయ్యద్ సర్వర్, పర్వీన్, యాకుబ్ జానీ, పాషా, బ్బీర్, గ్యామా, కుమార్, కమలాకర్, అన్వేష్, నగేష్, తదితరులు ఉన్నారు.

### నల్ల ప్రసాద్‌కు ఘన సన్మానం



**చింతపల్లి, (సింగిడి):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన నల్ల ప్రసాద్ ఎన్నికైన సందర్భంగా ఎంఆర్పీఎస్, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. నల్ల ప్రసాద్‌ను బీఎస్పీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జ్‌గా నియమించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నల్ల ప్రసాద్‌కు ఈ బాధ్యత దక్కడం చింతపల్లి ప్రాంతానికి గర్వకారణ మని, బహుజనుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎర్ర జగన్, ఎంఆర్పీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చెన్నయ్య, మాజీ చింతపల్లి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఎర్ర వెంకటయ్య, సమాచార ప్రచార సమితి అధ్యక్షులు ఏనుగుల వెంకటయ్య, రాములు, నల్ల ఆంజనేయులు, మొగులయ్య, సురేష్, శ్రీను, కుమార్, జగన్, నాగయ్య, కళ్యాణ్, యాదగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### బాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాల పంపిణీ



**చింతపల్లి ,(సింగిడి):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో మధ్యాహ్నం హారతి అనంతరం ప్రతిరోజు జనగణమన జాతీయ గీతాన్ని ఆలపించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలన్న సంకల్పంతో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య గురువారం జరిగిన స్వామివారి మధ్యాహ్న హారతి అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రతి ఒక్కరికి మూడు రంగుల జాతీయ జెండాను పంపిణీ చేశారు. జాతీయ జెండాలను భక్తులకు పంపిణీ చేయడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి పూరే కృష్ణయ్య, ఆలయ పర్యవేక్షకులుతడకమళ్ళ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


## మల్లారం పాఠశాలలో ఘనంగా బ్రేక్‌ఫాస్ట్

### ప్రారంభించిన సర్పంచ్ కటికి కిరణ్ కుమార్



**తల్లాడ, (సింగిడి):** మల్లారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించే బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కటికి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం పూట పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలనుసద్వినియోగంచేసుకోవాలని సూచించారు. విద్యార్థులకునాణ్యమైనరుచికరమైన అల్పాహారం అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రి నరసింహ రావు, భూక్యా అంజయ్య, పాఠశాల హెడ్ మాస్టర్ హరిబాబు, ఉపాధ్యాయులుఅనిల్, వెంకట రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ సిద్ధిక్ మియా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కు వినతి



**వలిగొండ, (సింగిడి):** ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ దశరథ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిఆర్సి ప్రకటించి వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆరు డిఏ లను మంజూరు చేయాలని, పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, లింగయ్య, ప్రభాకర్, జిలాని, నాగేందర్, బిక్షపతి, లింగయ్య, వెంకటయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గిరిజన బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన సిపిఐ(ఎం) నేతలు

## పెండింగ్‌లో ఉన్న భవనాలను వెంటనే పూర్తి చేయాలి.. ఖాళీ టీచర్, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలి






**వైరా, (సింగిడి):** వైరా మండలం ముసలిమడుగులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను గురువారం సిపిఐ(ఎం) నాయకుల బృందం సందర్శించి విద్యార్థులు, ప్రిన్సిపాల్‌ను కలిసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పాఠశాలలో అదనపు తరగతి గదులు, ఉపాధ్యాయుల నివాస భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ వెంటనే స్పందించి అవసరమైన నిధులు విడుదల చేసి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న సరుకుల నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాసిరకం సరుకుల సరఫరాను నిలిపివేసి నాణ్యమైన సరుకులతో పాటు తాజా కూరగాయలు, పండ్లు అందించాలని కోరారు. అక్కడే ఉన్నఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీఓ) దృష్టికి తాము గమనించిన సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపిన ఉపాధ్యాయులను వెంటనే తిరిగి ముసలిమడుగు గురుకుల పాఠశాలకు రప్పించి విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధనా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, నాణ్యమైన ఆహారం వంటి అన్ని సౌకర్యాలను కల్పించాలని సిపిఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సర్వే బృందంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యురాలు మచ్చా మణి, డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరరావు, తుము సుధాకర్, నాయకులు గుడిమెట్ల రజిత, తోట కృష్ణవేణి, భూక్యా విజయ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఫోటోలు: వైరా మండలం ముసలిమడుగు గ్రామంలో గిరిజన గురుకుల బాలికల పాఠశాల కళాశాల ప్రాంగణాలను పరిశీలించి అనంతరం అధికారికి వినత పత్రం సమర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు.

# 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని సబ్ స్టేషన్ ఆవరణలో రైతులు నిరసన



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. కరెంటు కోతలతో వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మార్చాల గ్రామ సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం విద్యుత్ సరఫరాను సుమారు 12 గంటలకే పరిమితం చేసిందని ఆరోపించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే యథావిధిగా 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిజాముద్దీన్, మాజీ ఉపసర్పంచ్ మదన్‌మోహన్‌రావు, వార్డు సభ్యుడు కిషోర్, రైతులు మల్లారెడ్డి, గౌడుగు శేఖర్, ఐలయ్య, సుల్తాన్, ప్రవీణ్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ దుకాణాలలో స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించాలి



**నాగర్ కర్నూల్ (సింగిడి):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని వక్ఫ్ బోర్డు నిర్మించనున్న దుకాణ సముదాయంలో స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించాలని, ముస్లిం అడ్వైజరీ కమిటీ అధ్యక్షులు షేక్ మక్సూద్ కు గురువారం నాగర్ కర్నూల్ పట్టణ ముస్లిం మైనార్టీ యువకులు వినతిపత్రం అందించారు. నాగర్ కర్నూల్ వక్ఫ్ కాంప్లెక్స్ దుకాణ వెనుక భాగంలో నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని, నాగర్ కర్నూల్ పట్టణ స్థానికులను కాదని చుట్టుపక్కల గ్రామాలు ఇతర ప్రాంతాల వారికి దుకాణాలను కేటాయించవ ద్దని కోరారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ కమిటీ కార్యాలయం అక్కడి నుంచి తరలించరాదని దాని వెనుక భాగంలో నిర్మించ తలపెట్టిన యు కాంప్లెక్స్ నిర్మాణం పనులు చేపట్టవద్దని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగనూలు రోడ్డున గల నిర్మించనున్న ఆటోనగర్ దుకాణాల కోసం డిపాజిట్ చేసి 10 ఏళ్ళు గడుస్తున్న నిర్మాణ పనులు చేపట్టలేదని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. ముస్లిం అడ్వైజరీ కమిటీ ద్వారా కాంప్లెక్స్ కమిటీకి ఈ అంశాలపై దృష్టి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ యువకులు మహమ్మద్ నసీర్, మహమ్మద్ హస్సేన్, మహమ్మద్ గౌస్, సాజిద్, నిజాం, అహ్మద్ బాబాజీర్ తదితరులు ఉన్నారు.


# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా చేయడమే లక్ష్యం



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ చుక్కపూరు గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ విరేశ లింగం, ఉప సర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు శ్రీధర్, మల్లేష్, శేఖర్, చంద్ర కుమార్, రాకేష్ ,విష్ణు, గ్రామ కార్యదర్శి శ్రీను మరియు గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్షాకాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ ఘటనపై మండిపడ్డ మాజీ చైర్మన్లు

## – ఎ యం సి మాజీ చైర్మన్లు బండి వేణుగోపాల్, జి. సుధాకర్



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** ఖర్గే మాట్లాడిన వేదికను శుద్ధి చేయడం బీజేపీ మనువాద మూర్ఖత్వానికి పరాకాష్ట అని మండిపడ్డ ఎ యం సి మాజీ చైర్మన్లు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు దాటుతున్నా, 21వ శతాబ్దంలోనూ దేశంలో కుల వివక్ష ఇంకా సజీవంగానే ఉందనడానికి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీలో జరిగిన ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు బండి వేణుగోపాల్, జి. సుధాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హల్ద్వానీ రాంలీలా మైదానంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, దళిత సామాజిక వర్గానికి చెందిన అగ్రనేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన అనంతరం.. ఆ వేదిక అపవిత్రం అయిందనే నెపంతో భారతీయ జనతా పార్టీ నేతలు దానిని గోమూత్రంతో కడిగి, యజ్ఞం నిర్వహించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత హేయమైన చర్య అని, మానవత్వానికి మాయని మచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇది కేవలం ఒక నాయకుడిపై జరిగిన దాడి కాదని, సమస్త దళిత సామాజిక వర్గం ఆత్మగౌరవంపై జరిగిన దాడి అని అన్నారు. దళిత నాయకుడు వేదికపై నిలబడి మాట్లాడారనే కారణంతోనే బీజేపీ నేతలు ఈ శుద్ధి కార్యక్రమం నిర్వహించారని పేర్కొన్నారు. పేదవులపై 'సబ్‌కా సాథ్ – సబ్‌కా వికాస్' అని చెప్పే బీజేపీ, మనసులో ఇంకా దళితులను అంటరానివారిగానే చూస్తోందని ఈ ఘటన నిరూపిస్తోందని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం అందించి ఇన్నేళ్లవుతున్నా, ఇలాంటి మనువాద ఆలోచనలు దేశ ఐక్యతను, సామాజిక సామరస్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని తెలిపారు. కుల వివక్షతో కూడిన ఈ హేయమైన చర్యకు పాల్పడిన బీజేపీ నేతలపై తక్షణమే రాజ్యాంగ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని దళితులందరికీ ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి వివక్షాపూరిత చర్యలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు.

# యువత విద్యార్థులు జాతీయతా భావంతో ముందుకు సాగాలి..

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్.




**నాగర్ కర్నూల్ (సింగిడి):** స్వతంత్ర సమరయోధుల త్యాగాలు భారత రాజ్యాంగ విలువలను తెలుసుకొని యువత విద్యార్థులు జాతీయతాభావంతో ముందుకు సాగాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ సూచించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ పర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేంద్ర రావు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దన్నోజు నరేష్ చారి బుసిరెడ్డి సుబ్బారెడ్డి పోల్దాస్ రాము హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.

దేశం కోసం అహర్నిశను కృషి చేస్తున్న సైనికులు, రైతులు శాస్త్రవేత్తలు యువతతో పాటు ప్రతి భారతీయుడి పాత్ర దేశ ప్రగతిలో కీలకమని అన్నారు. దేశ ఐక్యత సమగ్రత సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతలను స్వీకరించాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం జాతీయ జెండాను ఎగరవేయడం మాత్రమే కాకుండా దేశం పట్ల మనకున్న గౌరవం బాధ్యత దేశభక్తిని వ్యక్తం చేసే గొప్ప కార్యక్రమమని అన్నారు.

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదగాలనే సంకల్పంతో ప్రధానమంత్రి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని గుర్తు చేశారు. దేశ స్వతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన స్వతంత్ర సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని అన్నారు. యువత కుటుంబం కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు మొదటి వరుసలో నిలబడాలని అన్నారు.

నేటి తరం యువకులు రేపటి రానున్న భారతదేశాన్ని నిర్మించే గొప్ప ఇంజనీర్లుగా డాక్టర్లుగా సైనికులుగా రైతన్నలుగా సైంటిస్టులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నాగేంద్ర గౌడ్ మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్ ఓ బి సి మోర్చా అధ్యక్షులు వెంకటేష్ చంద్రకళ జానకి రాజేష్ రెడ్డి వెంకటేష్ సత్యనారాయణ ఏబీవీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత



**మహాదేవపూర్ (సింగిడి):** బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కాటారం వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయ గా అందులో 7 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం వేసుకొని తరలిస్తున్నారని వెంటనే నిందితులు బొమ్మ గణపతి, హనుమల గణపతి లను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేదలకు చెందాల్సిన బియ్యాన్ని అక్రమ రవాణా, నిలువ, విక్రయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ బియ్యం రవాణాపై పోలీసుల నిఘా ఎప్పటికీ ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎవరైనా అక్రమ బియ్యం రవాణా చేస్తే 8712658116 ఫోన్ చేసి వివరాల అందించాలని వివరాల అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

### హర్ ఘర్ తిరంగాతో 'వికసిత్ భారత్' సంకల్పాన్ని చాటుదాం



**చింతపల్లి, (సింగిడి):** : ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ మాజీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు, తేదేడు గ్రామ మాజీ ఉపసర్పంచ్ ధరణి పతి రమణారావు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు సూచనలతో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండలంలోని తీదేడు గ్రామంలోని తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా ధరణి పతి రమణా రావు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం ప్రతి భారతీ యుడు గర్వపడే విధంగా, దేశ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటి పై జాతీయ జెండాను ఎగురవేసి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు గణేష్ పాల్గొన్నారు.

### స్త్రీశక్తి భవనానికి స్థలం కేటాయింపుపై ఆర్టీఐ దరఖాస్తు


**కోదాడ, (సింగిడి):** : అనంతగిరి మండలం మొగలాయి కోట గ్రామపంచాయతీ పరిధిలో స్త్రీశక్తి భవనానికి స్థలం కేటాయింపునకు సంబంధించిన వివరాలు వెల్లడించాలని కోరుతూ గ్రామానికి చెందిన పెద్దపంగు అంజయ్య సమాచార హక్కు చట్టం--2005 కింద ఎంపీడీవో కార్యాలయంలో గురువారం దరఖాస్తు సమర్పించారు. స్థలం కేటాయింపునకు సంబంధించి గ్రామపంచాయతీ, గ్రామసభలో చేసిన తీర్మానం పూర్తి ప్రతితో పాటు తీర్మానం తేదీ, సంఖ్య, సమావేశ వివరాలు అందించాలని కోరారు. అలాగే స్థల కేటాయింపునకు సంబంధించినఅనుమతులు, ప్రతిపాదనలు, ఉత్తర్వులు, ఇతర అధికారిక రికార్డుల ధ్రువీకరించిన ప్రతులు ఇవ్వాలని దరఖాస్తులో పేర్కొన్నారు. స్థలానికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, భూమి స్వరూపం, యాజమాన్య వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. సమాచారం హక్కు చట్టం ప్రకారం నిర్ణీత గడువులో వివరాలు అందించాలని అంజయ్య కోరారు.

### జంట హత్యల కేసులో

## పోలీసుల పురోగతి?

### పోలీసుల అదుపులో నిందితులు..


### కానిస్టేబుల్ పాత్రపై అనుమానాలు



**కోదాడ, (సింగిడి):** : మోతే శివారులో బీక్యా తండాకు చెందిన బూబా, నాగు దంపతుల జంట హత్యల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతదేహాలను వ్యవసాయ భూమిలో పాతి పెట్టినట్లు సమాచారం. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసులో ఆరుగురి ప్రమేయం ఉన్నట్లు, వారిలో ఓ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

### ప్రేయసి పై పెట్రోలు పోసి

## హతమార్చిన ప్రియుడు?



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలం కొట్ర గ్రామ శివారులో 22 ఏళ్ల యువతి నారమళ్ల అనూష దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. అర్ధరాత్రి వ్యవసాయ పొలంలో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు సమాచారం. ఘటనాస్థలంలో అనూష మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమైంది. ఈ ఘటనలో కొట్ర గ్రామానికి చెందిన షాంపూరి రాములు ప్రధాన నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు మరో యువకుడు సహకరించినట్లు కూడా ప్రాథమిక సమాచారం. అనూషకు రాములుతో గత కొంతకాలంగా సంబంధం ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హత్య జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతురాలికి భర్తతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నట్లు సమాచారం. ఘటన విషయం తెలుసుకున్న వెల్దండ సీఐ రఘువీర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు అసలు కారణం ఏమిటి? ఇందులో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
16-8-2026

# స్మార్ట్ వైష్ణవి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

### బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు కురువపల్లయ్య, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు హాలీం పాషా

**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ స్మార్ట్ వైష్ణవి హైస్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీమ్ పాషా డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి 22 మంది విద్యార్థులకు మెమోలు ఇవ్వకుండా వారి అకాడమిక్ ఇయర్‌ను నష్టపరిచారని ఆరోపించారు. ఈ విషయంపై ఒక విద్యార్థి జూన్ 3న అలంపూర్ చౌరస్తాలో జరిగిన ప్రజావాణిలో డీఈఓకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన



యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా పాఠశాలలో హాస్టల్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు, దుస్తుల విషయంలోనూ విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. ఫీజుల పట్టికను అడిగినా చూపించడం లేదని, నోటీస్ బోర్డులో కూడా ఫీజుల వివరాలు ప్రదర్శించడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించకుండా తక్కువ వేతనాలతో సిబ్బందితో బోధన కొనసాగిస్తున్నారని విమర్శించారు. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాఠశాలలో సరైన ఆటస్థలం కూడా లేదని పేర్కొన్నారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టర్, డీఈఓ తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల కోసం భవిష్యత్ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్

**గద్వాల బ్యూరో (సింగిడి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గద్వాల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమా ల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు సూచనలను ఇచ్చారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్య అతిథిలు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతి నిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు



జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ కు ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. జిలాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్ ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల న్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డీవో శ్రీనివాస రావు, కలెక్టరేట్ ఏ.ఓ మంజుల, గద్వాల్ తహసీల్దార్ హరి కృష్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# శానాయపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం







**నూతన గ్రామపంచాయతీ, మహిళా సమైక్య భవనాల ప్రారంభం**

**ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట**

**గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

**రేవల్లి, (సింగిడి)::** గ్రామాల సర్వతోముఖాభివృద్ధితో పాటుప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమనివనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రేవల్లి మండలం శానాయపల్లిగ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్యభవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైనమౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువకానున్నాయని తెలిపారు. మహిళా సమైక్య భవనం గ్రామంలోని మహిళా సంఘాలకుఉపయోగకరంగా ఉంటుందని, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం అండగానిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం శానాయపల్లి గ్రామానికి చెందిన మిద్దె శేషమ్మ, సవాయి రేణుకకుటుంబాలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన గృహాల్లోకి అడుగు పెట్టిన లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకుసొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్నిప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తుందనిఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలాచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ప్రభుత్వ భవనాలు, మహిళా సంఘాలకు అవసరమైన మౌలికవసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. శానాయపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకుకృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి గోపాల్పేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కే వెంకటేష్, వైస్ చైర్మన్ మంద సత్యశీలా రెడ్డి, రేవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి సుల్తాన్ అలీ, పీఏసీఎస్అధ్యక్షుడు లోడే రఘు, జిల్లా కార్యదర్శి వాడల పర్వతాలు, మార్కెట్ కమిటీడైరెక్టర్లు అరెకంటి సిరిమల్లేష్, కనకట్ల తిరుపతయ్య, బండరాయిపాకుల సర్పంచ్ ధూపం రాజు, డిప్యూటీ సర్పంచ్ సుకుమార్ రెడ్డి, రేవల్లి మండలఎస్సీ సెల్ అధ్యక్షుడు మిద్దె స్వామి, శానాయిపల్లి సర్పంచ్ కృష్ణయ్య, ఏదుల మండల అధ్యక్షుడు పందెం సుఖేందర్ రెడ్డి, కేశంపేట సర్పంచ్ బాదపల్లి రేవతి, నాగపూర్ సర్పంచ్ లోడే అంజనమ్మ, రేవల్లి సర్పంచ్ టప్ప రాజయ్య, కొంకి వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, నాగం కరుణాకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, బాలస్వామి, సుబ్బారెడ్డి, కొమ్మిడి రవి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యంలో తల్లాడ గ్రామపంచాయతీ ముందంజ

### శాశ్వతంగా తీరిన మంచినీటి సమస్య సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు

**తల్లాడ, (సింగిడి):** మండల కేంద్రమైన తల్లాడ గ్రామపంచాయతీ అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల్లో ముందంజలో కొనసాగుతోంది. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గ్రామంలో పలు అభివృద్ధి, పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు.

**పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం**

గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో గడ్డి మందు పిచికారీ చేయించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల వ్యాప్తిని అరికట్టేందుకు 'కింగ్ ఫామ్' ఫాగింగ్ మిషన్‌తో గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. అదేవిధంగా మురుగునీరు నిల్వ ఉండకుండా పూడికతో నిండిన మురుగు కాలువలను గుర్తించి ప్రత్యేకంగా శుభ్రం చేయడంతో పాటు అవసరమైన చోట్ల మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడుతున్నాయని ప్రజలు



పేర్కొంటున్నారు.

**శాశ్వతంగా తీరిన మంచినీటి సమస్య**

ఇటీవల మిషన్ భగీరథ నీటి సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ పాలకవర్గం తక్షణమే స్పందించింది. వైరా చెరువు నుంచి తల్లాడ గ్రామపంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ శాశ్వత ఏర్పాటుతో గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం



చేస్తున్నారని తెలిపారు.

**ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం**

గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. తల్లాడ గ్రామపంచాయతీని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీహరి కృష్ణ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి




**కమలాపూర్ (సింగిడి):** సైబర్ నేరాలు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలపై ప్రజలు విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సి ఐ పి నవీన్ అన్నారు. గురువారం కమలాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర ఉన్నత పాఠశాలలో కమలాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంజెపి బాలుర ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల, ఇంటర్‌కాలేజీ సిబ్బందితో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, 80 మందిఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొని సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాఇన్‌స్పెక్టర్ పి నవీన్ మాట్లాడుతూ తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనినమ్మించి నకిలీ పెట్టుబడి యాప్‌లు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల ప్రతి ఒక్కరూఅప్రమత్తంగా ఉండాలని వివరించారు. తెలియని వ్యక్తులు పంపే లింకు లను క్లిక్‌చేయడం, ఓ టి పి, బ్యాంక్ ఖాతా వివరాలు, యూపీ ఐ వంటి సమాచారాన్ని ఇతరులతోపంచుకోవడం చేయరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యంచేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, సమీప పోలీస్ స్టేషన్‌కుసమాచారం అందించాలని వివరించారు. అత్యాశకు పోకుండా, పెట్టుబడి పెట్టేముందు సంస్థ, యాప్, వెబ్‌సైట్ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలనితెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధు, ఎంజెపి ప్రిన్సిపాల్ టి రవీందర్, పాఠశాలలు, కళాశాల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి వద్దు.. ఆరుతడి పంటలే మేలు

### కొత్తకొండలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు



**భీమదేవరపల్లి (సింగిడి):** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ప్రస్తుతం నీరు ఉందని వరి సాగు చేస్తే చివరి దశలో నీటి కొరత ఏర్పడి పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో ఆరుతడి పంటలు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న మాట్లాడుతూ కంది, పెసర, మినుము, బబ్బర్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. చీడపీడల నివారణ, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి నాట్లు వేయకుండా ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. రైతు రిజిస్ట్రేషన్, ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, జీవ ఎరువుల వినియోగంపై వివరించారు.
కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ స్రవంతి, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రయత్నం అభినందనీయం





**నారాయణపేట (సింగిడి):** నేటి సాంకేతిక యుగంలో పాఠాలు బోధిస్తున్న ఏ టీచర్ అయినా సమయం లేదు అంటూ సమాయనకూ పాఠాలు నేర్పి తమ తమ ఇళ్లకు తొందరగా చేరుకోవడమే పరమావధిగా భావిస్తారు. అలాంటి వాతావర ణానికి భిన్నంగా ఓ మాస్టారు స్టోరీ లోకి వెళదాం... విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు, పౌష్టికాహారాన్ని కూడా అందించేందుకు ఒక ఉపాధ్యాయుడు చేస్తున్న ప్రయత్నం నిజంగా అభినందనీయం. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు జనార్దన్ రెడ్డి ఎక్కడికి ట్రాన్స్ఫర్ అయినా ఏ పాఠశాలకి వెళ్లిన ఆ వాతావరణం పూర్తిగా మార్చి వేస్తారు అనడంలో అతిశయోక్తి లేదు.

**బడుల్లో పసి మొలకలు.. పిల్లల కడుపు నింపే ఆకుకూరలు**

బడుగు బలహీన వర్గాల పిల్లలే ప్రభుత్వ బడులకు వస్తారు కాబట్టి వారి ఆరోగ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని తనదైన శైలిలో విద్యార్థులను తన సొంత పిల్లల్లా చూసుకునే నైజం కలిగిన ఉపాధ్యాయుడు జనార్ధన్ రెడ్డి. ముడుమాల్ పాఠశాలలో ఉపాధ్యాయుడు జనార్ధన్ రెడ్డి వినూత్న ప్రయోగంవిద్యార్థులకు చదువుతో పాటు, పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో ముడుమాల్ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు జనార్ధన్ రెడ్డి ఒక అద్భుతమైన ప్రయోగాన్ని చేపట్టారు. ఆయన తన కుటుంబ నేపథ్యం అయిన వ్యవసాయాన్ని ఉపయోగించి, పాఠశాల ఆవరణలోనే కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేశారు. ఈ గార్డెన్‌లో ఎటువంటి రసాయన మందులు వాడకుండా, ప్రకృతి పద్ధతుల్లో రకరకాల కూరగాయలను పండిస్తున్నారు.

**విద్యార్థులతో కలిసి సాగు**

జనార్ధన్ రెడ్డి తన ప్రయోగంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేశారు. విద్యార్థులతో కలిసి కిచెన్ గార్డెన్‌లో మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, కలుపు తీయడం వంటి పనులను చేస్తారు. దీనివల్ల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన పెరగడంతో పాటు, శారీరక శ్రమ యొక్క ప్రాముఖ్యత కూడా తెలుస్తోంది. జనార్ధన్ రెడ్డి పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజనంలో ఉపయోగించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రసాయన మందులు వాడకుండా పండించిన కూరగాయలు కాబట్టి, ఇవి పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.
జనార్ధన్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయం. ఆయన ఒక ఉపాధ్యాయుడిగా తన బాధ్యతను మరింత విస్తరించి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇతర పాఠశాలలకు కూడా ఈ ప్రయోగం ఒక ఆదర్శంగా నిలవాలని కోరుకుందాం.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

### భీమదేవరపల్లిలో తహసీల్దార్ కు వినతి



**భీమదేవరపల్లి (సింగిడి):** దీర్ఘకాలంగా పెం డింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ, పెన్షనర్ల సమస్య లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు అటుకుల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. నాలుగు దశల పోరాటంలో భాగంగా భీమదేవరపల్లి తహసీల్దార్ రాజేష్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, కరువు భత్యాలు, బిల్లులు, పాత పెన్షన్, ఆరోగ్య కార్డులు తదితర సమస్యలను పరిష్కరిం చాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29న హైదరాబాద్‌లో మహాధర్నా, సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డోరి రమేష్, సీహెచ్ రాజేంద్రం, దాసరి రవీందర్, మాడుగుల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సమానత్వమే లక్ష్యం..

## ఏకరూప దుస్తుల పంపిణీ




**భీమదేవరపల్లి (సింగిడి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్య సమానత్వ భావన పెంపొందించడంతో పాటు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప పాఠశాల దుస్తులను సర్పంచ్ మాచర్ల కుమారస్వామి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాలస్వామి, వీఓ అశోక్, ఉపాధ్యాయులు రాజేందర్, స్టాలిన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### ముల్కనూరులో ఎమ్ ఆర్ పి ఎస్

## విస్తృతస్థాయి సమావేశం



**భీమదేవరపల్లి (సింగిడి):** కుల వివక్ష, మత దురహంకారం, సామాజిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ లో జిల్లా ఇంచార్జ్ ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ముల్కనూ రులోని విద్యాభారతి పాఠశాలలో ఎంఆర్పిఎస్, ఎంఎస్పి అనుబంధ విభాగాల విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి మాట్ల వెంకటస్వామి మాదిగ అధ్యక్షత వహించగా, ఏపూరి వెంకటేశ్వర్లు, ఎమ్ ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. కుల వ్యవస్థ కారణంగా అణగారిన వర్గాలు వివక్షకు, పేదరికానికి గురవుతున్నాయని అన్నారు. పేదల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమించాలని సూచించారు. ఎమ్ ఆర్ పి ఎస్, అనుబంధ విభాగాల పునర్నిర్మాణంలో భాగంగా అన్ని గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థులు, యువతను ఉద్యమంలోకి తీసుకొచ్చి నూతన తరాన్ని శక్తివంతమైన ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెండాల కుమార్, బలెపాక స్వామి, శిఖ సురేష్, పారినందుల మహేందర్, మాడుగుల ప్రభుదాస్, వేల్పుల ప్రశాంత్, పోర్నందుల సురేష్, నాగిన్ల చందర్, మంగళపల్లి దిలీప్, కాదాస్ ప్రవీణ్, గజ్జల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై

# తహసిల్దార్ కు మెమోరాండం అందజేత..



**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** ఉపాధ్యాయుల ముఖ్యమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ మరిపెడ శాఖ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలో భాగంగా గురువారం రోజుమరిపెడ మండల నాయబ్ తహసిల్దార్ డి.మాల్యా మెమోరాండమును అందించారు. ఉపాధ్యాయసమస్యలన్నీ విద్యారంగ సమస్యలే అని ప్రభుత్వం వాటిని గుర్తించి వెంటనేపరిష్కరించాలని, పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న డి. ఏలను విడుదల చేయాలని సిపిఎస్ ను రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనేమంజూరు చేయాలని, ప్రభుత్వ పాఠశాల కుదింపు ఆలోచనను ప్రభుత్వంవిరమించుకోవాలని, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్ గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గురుకుల పాఠశాల టైం టేబుల్ లనుశాస్త్రీయంగా సవరించి విద్యార్థులకు ఉపాధ్యాయులకు అనుకూలంగా మార్పుచేయాలని, విద్యారంగంలో స్వచ్ఛంద సంస్థల జోక్యాన్ని నివారించాలని... మొత్తం29 డిమాండ్లతో కూడిన మెమోరాండం ను తహసిల్దార్ అందించడం జరిగింది. కార్యక్రమంలో యు ఎస్ పి సి తరపున టి పి టి ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్ధనాచారి, యుటిఎఫ్ మండల బాధ్యులు ప్రభాకర్ రావు, గోవర్ధన్, నెహ్రూ దేవులా, మంగు, కళ్యాణి, సోమ్లా మురళీకృష్ణ, లాల్ చంద్, టిపిటిఎఫ్ మండల బాధ్యులుహాఫీజర్, పవన్, రవి, రవీంద్ర కుమార్, మంజు భార్గవి తదితరులు పాల్గొన్నారు..

# అల్పాహారం కార్యక్రమంను పరిశీలించిన వార్డు మెంబెర్ స్వర్ణలత





**తల్లాడ, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిరోజూ ఉచితంగా అల్పా హారం అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం తల్లాడ మండలంలోని జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యా యుల ఆహ్వానం మేరకు తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు పెరిక స్వర్ణలత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, చదువుపై ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంఅభినందనీ యమన్నారు. అల్పాహార కార్యక్రమాన్ని పాఠశాలలో చక్కగా నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను స్వర్ణలత అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు

సాలురా లో విత్తన శుద్ధిపై

# అవగాహన కార్యక్రమం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** సాలురా మండల కేంద్రంలో ఆర్ఎడబ్ల్యూఈ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్థానిక హోస్ట్ రైతులు, గ్రామస్థులకు విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విత్తన శుద్ధి చేసే విధానం, విత్తన శుద్ధి సమయంలో పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. విత్తన శుద్ధిని సరైన పద్ధతిలో చేయడం వల్ల పంట ప్రారంభ దశలో వ్యాధుల ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన మొలకలు పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు విత్తన శుద్ధి ప్రక్రియను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న హోస్ట్ రైతులు, గ్రామస్థులు పాల్గొని విత్తన శుద్ధి విధానాన్ని పరిశీలించి తమ సందేహాలను విద్యార్థులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు.

ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా

## శంకర్ నాయక్ బాధ్యతల స్వీకరణ



**మిర్యాలగూడ (సింగిడి):** తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ హామీల కమిటీ (2026--27) చైర్మన్‌గా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కమిటీ ప్రాథమిక సమావేశంలో కమిటీ కార్యకలాపాలపై చర్చించారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌తో పాటు కమిటీ సభ్యులు శంకర్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం శాసనసభలో ఇచ్చిన హామీల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించి, ప్రజలకు ఇచ్చిన హామీలు సకాలంలో నెరవేరేలా కృషి చేస్తానని శంకర్ నాయక్ తెలిపారు.

నిబంధనలు పాటిస్తేనే

# సురక్షిత ప్రయాణం

రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు



**బిజినపల్లి (సింగిడి):** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సుతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాహనదారులు, ప్రజల్లో రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై చైతన్యం కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్‌సింగ్ జి. పాటీల్, డీఎస్పీ బి. శ్రీనివాస్ యాదవ్, ఆర్టీఓ జి. సాయికృష్ణ, డీటీఓ జి. ఇమ్రాన్ అహ్మద్, ట్రాఫిక్ ఎస్ఐ జి. కళ్యాణ్, బిజినేపల్లి ఎస్ఐ షేక్ షంశోద్దీన్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు మంగి ఆంజనేయులు కార్యదర్శి బోనాసిరాజు సంస్కృతిక కళాకారులు భాస్కర్ డప్పు లక్ష్మణ్ బి రాజు ఉదయ్ కుమార్ రమాదేవి తదితర అధికారులు హాజరుకానున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను బాధ్యతాయుతంగా పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డు

## ఏర్పాటు చేయాలని

# తహసిల్దార్ కు వినతి



**వలిగొండ, (సింగిడి):** ప్రభుత్వం వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ అన్నారు. గురువారం హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసిల్దార్ దశరథకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వారు హమాలీలకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయడం లేదని అన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు కూడా పెంచడం లేదని వారికి భద్రత సౌకర్యం కల్పించడం లేదని ప్రమాదాలకు గురైన వారిని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టో విషయాన్ని వెంటనే అమలు చేసి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా 55 సంవత్సరాలు నిండిన హమాలి కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ 6 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జర్నీ జంగయ్య, బుడిగ వెంకటేశం, గాడిపెల్లి, నరసింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం

నూతన ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్







**నాగర్ కర్నూల్ (సింగిడి):** విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేసేందుకు క్రీడలను పోలీస్ అధికారులు బిజీగా ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.
నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌తో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు సుమారు రూ. 8 లక్షల నిధులతో ఈ ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు. ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటారని ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.
ప్రతి ఉద్యోగికీ క్రీడలు అవసరమే అయినప్పటికీ పోలీసు సిబ్బందికి వాటి అవసరం మరింత ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, ఏకాగ్రత, చురుకుదనం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని, పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటే విధి నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు. పోలీసు సిబ్బందికి మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు రూ. 8 లక్షల నిధులతో ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ ప్రత్యేక కృషితో ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ సదుపాయాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు ఫిట్నెస్ తో ఉంటేనే ఉద్యోగ నిర్వహణ శారీరక మానసిక ఆనందం కలుగుతుందని ప్రతి ఒక్కరు విధిగా శారీరక మానసిక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ......, పోలీసు ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, రెవెన్యూ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో ఉంటారని, అనేక సందర్భాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుందని ఎస్పీ తెలిపారు. ఇటువంటి పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని, పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ శాఖాపరంగా అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు ఉన్నప్పుడే విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలమని అన్నారు.
కలెక్టర్, ఎస్పీ, అధికారులు స్వయంగా షటిల్ ఆడి ఉత్సాహంగా పాల్గొన్నారు. కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ తదితర అధికారులు నూతన ఇండోర్ షటిల్ కోర్టులో స్వయంగా బ్యాడ్మింటన్ ఆడారు. కొద్దిసేపు అధికారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడంతో పోలీసు సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నెల కోల్పారు. అధికారులు స్వయంగా క్రీడా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పోలీసు సిబ్బందికి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై మరింత అవగాహన కల్పించారు. అంతకుముందు పోలీస్ క్రీడా మైదానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌కు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించి ఘనంగా స్వాగతం పలికారు.
అనంతరం కలెక్టర్, ఎస్పీ కలిసి నూతన ఇండోర్ షటిల్ కోర్టును పరిశీలించి, ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ , సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించిన చౌటుప్పల్ పోలీసులు

మహిళలు చిన్నారులపై జరిగే నేరాల ను అరికట్టడంలో ప్రతి ఒక్కరు బాధ్యత గా వ్యవహరించాలి: చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్





**మునుగోడు (సింగిడి):** మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో, మునుగోడు నియోజకవర్గం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపురం ఐటీ పార్క్‌లోని తెలుగు పచ్చళ్ళు కంపెనీలో ఉమెన్ సేఫ్టీ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో, నిర్వహించిన. ఈ కార్యక్రమంలో, మహిళలు, చిన్నారులు ఎదుర్కొనే వివిధ రకాల సమస్యలు, వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులను సంప్రదించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఏదైనా సమస్య ఎదురైనప్పుడు, భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, సి డి ఈ డబ్ల్యు కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది కంపెనీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొని మహిళలు మరియు చిన్నారుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారని సిఐ మన్మథ కుమార్ తెలిపారు.

## మండల సమగ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలి: సలిగంజి వీరస్వామి



**వలిగొండ, (సింగిడి):** మండలంలోని వివిధ గ్రామాలు సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి అన్నారు. గురువారం సిపిఐ ఆధ్వర్యంలో రెండవ రోజు ప్రజా చైతన్య యాత్ర వేములకొండ వెంకటాపురం, ఆరూరు, నాగారం, గొల్నేపల్లి, సంగెం, గోకారం , టేకులసోమారం, పహిల్వాన్ పురం, రెడ్లరేపాక మీదగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నప్పటికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తుందని, రైతుబంధు , రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, మహిళలకు వంటగ్యాస్, ప్రతి మహిళలకు 2500 రూపాయలు, తులం బంగారం సంక్షేమ పథకాలు అమలు జరపటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది అని అన్నారు. మూసి ప్రక్షాళన సత్వరమే చేయాలని మండల వ్యాప్తంగా బస్వాపురం రిజర్వాయర్ ద్వారా సాగు, త్రాగునీరు అందించాలని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు ఎలగందుల అంజయ్య, సల్వాద్రి రవీందర్, పోలేపాక యాదయ్య, పులిపలుపు మల్లేశం, అంబటి అంజయ్య, సుద్దాల సాయికుమార్, ఆకుల శ్రీను, వడ్డేగాని శంకరయ్య, బుంగ చక్రం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

ప్రభుత్వాని హెచ్చరించిన యూఎస్పీసి నాయకులు



**మునుగోడు ,(సింగిడి):**:దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ మునుగోడు మండల తాసిల్దార్ కి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, నాలుగు దశల పోరాట కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని మొదటి దశలో భాగంగా ఈ నెల 7వ తేదీన మునుగోడు మండలంలోని అన్ని పాఠశాలల్లో, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారని, రెండవ దశ పోరాట కార్యక్రమంలో భాగంగా, మునుగోడు మండల తహసిల్దార్ నరేష్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కి గురువారం యూ ఎస్పీ సీ నాయకులు మెమోరాండం ఇవ్వడం జరిగిందని, యూ ఎస్పీ సీ నాయకులు కె. రత్నయ్య, గేర నరసింహ, నలపరాజు వెంకన్న, తెలిపారు. పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచిన నూతన పీఆర్సీని అమలు చేయడం లేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు డీ.ఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడం లేదన్నారు. హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయాలని, అశాస్త్రీయంగా ఉన్న 25 జీవోను సవరించాలని, పర్యవేక్షక పోస్టులను భర్తీ చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.
లేనిపక్షంలో ఈ నెల 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 29వ తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ మొదటి వారంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని యూఎస్పీసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ మునుగోడు మండల నాయకులు బి. రాములు, ఎం. నటరాజు, ఎస్. లింగయ్య మరియు కల్లూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



**మహాదేవపూర్ (సింగిడి):** బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఎస్సై తెలివిన వివరాల ప్రకారం కాటారం వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయ గా అందులో 7 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం వేసుకొని తరలిస్తున్నారని వెంటనే నిందితులు బొమ్మ గణపతి, హనుమల గణపతి లను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేదలకు చెందాల్సిన బియ్యాన్ని అక్రమ రవాణా, నిలువ, విక్రయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ బియ్యం రవాణాపై పోలీసుల నిఘా ఎప్పటికీ ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎవరైనా అక్రమ బియ్యం రవాణా చేస్తే 8712658116 ఫోన్ చేసి వివరాల అందించాలని వివరాల అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

## నాంపల్లి లో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ



**మునుగోడు, (సింగిడి):** మునుగోడు నియోజకవర్గం. నాంపల్లి, జడ్. పి. హెచ్. ఎస్, టి జి ఎం ఎస్ మరియు జూనియర్ కాలేజ్ లో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సిపిఎస్ విధానం రద్దుపైన తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో, ఆగస్ట్ 23 న హైదరాబాద్ లో తలపెట్టిన చలోహైదరాబాద్, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ తెలిపారు.. ఈ సందర్భంగా నాంపల్లి మండల కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు. పి ఆర్ టి యు రాష్ట్ర అకడమిక్ గైడెన్స్ కమిటీ రాష్ట్ర నాయకుడు నక్క యుగంధర్ , పి ఆర్ టి యు మండల ప్రధాన్ కార్యదర్శి కిరణ్, టీ ఎస్ యు టి ఎఫ్ మండల కార్యదర్శి వెంకన్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలిపారు.... ఈ కార్యక్రమంలో, సి పి ఎస్ జిల్లా నాయకులు గురిజ మహేష్, రచ్చ శ్రీను, నాగిళ్ల ఆంజనేయులు ఇతర ఉపాధ్యాయినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరమ పవిత్రం...

# శ్రావణ మాసం



చైత్రాది మాస గణనలో శ్రావణం, అయిదవది ఉత్కృష్టమైనది. విష్ణుమూర్తి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం. ఈ నక్షత్ర యుక్త పూర్ణిమ కలది కావటం చేత ఈ మాసానికి శ్రవణము అనే పేరు వచ్చింది. శ్రీకృష్ణ భగవానుడు పుట్టిన మాసమిది హయగ్రీవ ఉత్పత్తి కూడా ఈ మాసంలోనే. గరుడుడు అమృత భాండాన్ని ఈ మాసంలోనే సాధించాడు.
"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే, జగత: పితరం వందే పార్వతీ పరమేశ్వరం "అని మహాకవి కాళిదాసు వాగర్థముల జ్ఞానానికై పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించాడు. వాగర్థములవలె కూడియున్న పార్వతీ పరమేశ్వరులు జగజ్జననీ జనకులు.
ఈశానాం సర్వ విజ్ఞానం. ఎల్లవిద్యలకు ఈశ్వరుడు పార్వతీ పతియే. అందుకే వేదం 'ప్రథమో దైవ్యో భిషక్' అని స్తుతిస్తున్నది. "అంత్యజో విధిమోనిపివా మూర్ఖోవా, పండితోవా, పంచాక్షరీం జపేన్నిష్టో ముచ్యతే పాప పంజరాత్ " అని శివపురాణం తెలుపుతున్నది. పూజా సంస్కారాలు తెలియని వారునూ, వేదం తెలియని వారైననూ, మూర్ఖులూ, పండితులూ ఎవరైననూ, ఓం నమఃశివాయ అని పంచాక్షరీ జపం పఠిస్తే, సర్వపాపాలూ, కష్టాలూ, దు:ఖాలూ పటాపంచల వుతాయని శివపురాణం స్పష్టం చేస్తున్నది. "నభోమా సేతుయో మర్త్య: లింగం శైవం సమర్చయేత్, పశ్యేద్యా పూజితం దేవం, సాయుజ్యం సోనిధి గచ్ఛతి". లోకేశ్వరుడు, అభయంకరుడైన శంకరుని శ్రావణమాసం అందునా ప్రత్యేకించి, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజిస్తే శివసాయుజ్యం పొందగలని పురాణాలు విశదీకరిస్తున్నాయి. న్యాసము అనగా ఐక్యము చేసుకోవడం. పూజకు పూర్వం రుద్రుడిని, లింగంలో నిలుపుకుని, తాను రుద్రుడై, ఆ రుద్రుడిని అభిషేకించాలి. అందులకై మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో, కనీసం శ్రావణ సోమ వారమైనా శివుని పూజించి, నిరాహారం, ఉపవాసం లేక ఏకభుక్తం చేయాలి. చంద్రమా మనసో జాతః అంటే చంద్రుడు మనస్సుకు కారకుడు. శివుడి తలపైన నెలవంక ఉంటుంది. సోమవారాలు చంద్రునికి సంబంధించిన పాలు, బియ్యం, తెల్లని వస్త్రాలు దానం చేయడం వల్ల చిత్త చాంచల్యం నుంచి బయట పడ గలుగుతారు. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. బుద్ధిలో విశ్లేణశక్తి పెరుగు తుంది.
"సోమవారం వ్రతం కార్యం, శ్రావణీవై యధావిధి, శక్తేన్ పోషణం కార్యం, అధవా నిశి భోజనం". "సోమవారే చతుర్దశ్యాం, కృష్ణపక్షే విశేషిత:, శ్రావణే పూజయేర్లింగం, శ్రేయోర్థ" రాఘవార్చితం".
ద్వాదశ మాసాల్లో శ్రావణం అత్యంత శ్రేష్ఠమైన పవిత్ర మాసం. వేసవి తాపంతోనున్న జీవకోటికి వర్షాలతో సేద తీరి ప్రాణం లేచి వస్తుంది. పాడి పంటలు, కూరగాయలు సమృద్ధియై పుష్పాలు, వృక్షాలు పచ్చదనంతో కళకళలాడుతూ, వింతశోభలు కూర్చుకుంటాయి.
ఈకాలంలో. పూజాక్రతువులకు, దానధర్మాలకు, దాతలకు, భోక్తలకు అనువైన మాసమిది. సృష్టి, స్థితి, లయకారులైన జగజ్జననీ జనకులు పార్వతీ పరమేశ్వరులు ఈపరమపవిత్ర మాసంలోనే సృష్టికార్యాన్ని ప్రారంభించారని పెద్దల ఉవాచ. మానవ దంపతులుకూడా శ్రావణ మాసాన్ని శుభ దినాలుగా ఎంచుకుంటారు. అంతేగాక శ్రావణ మాసంలో, హిందూ పండుగలు అధికంగా ఉంటాయి. వారానికి ఉన్న ఏడు రోజులలో మాఘ మాసంలో ఆదివారాలు, కార్తీకమాసంలో సోమవారాలు, మార్గశిర మాసంలో లక్ష్మీ వారాలు మహిమాన్వితాలుగా ఉన్నాయి. ఆది, సోమ లక్ష్మీ వారాలు పోతే, ఇక మిగిలిన నాలుగు వారాల్లో మూడు వారాలు ఒక్క శ్రావణ మాసంలోనే మహత్తు కలవిగా ఎంచబడుతున్నాయి. శ్రావణ మాసంలో శని వారాలు, మంగళ వారాలు, శుక్ర వారాలు ఎక్కువ నియమ నిష్టలను కోరేవిగా ఉన్నాయి. శ్రావణ సోమవారం శివారాధన, శ్రావణ మంగళవారం – గౌరీ పూజ, శుక్రవారం – వరలక్ష్మీ వ్రతం, శనివారం – విష్ణు పూజ, నాగుల చవితి, నాగపంచమి, గరుడ పంచమి, శ్రీకృష్ణ జన్మాష్టమి, పుత్రదైకాదశి, ఉపాకర్మ (యజ్ఞోపవీత ధారణం), రాఖీ పండుగ, హయగ్రీవ జయంతి, అజైకాదశి, పొలాల అమావాస్య, మొదలగు పండుగలు ఉండే శ్రావణమాసం లక్ష్మీపార్వతులకేగాక, హిందువులకు అత్యంత ఇష్టదాయకం. ప్రధానంగా ఈ మాసంలో మహిళలకు వరలక్ష్మీ వ్రతం, నూతన వివాహిత యువతులకు మంగళ గౌరీ వ్రతం ఆచరించే సాంప్రదాయం ఉంది. శ్రావణం దేవుడికి, భక్తుడికి అనుసంధానం కావించే మాసం. జలప్రియుడైన గంగాధరునికి దోసెడు నీటితో అభిషేకించి, పిడికెడు భస్మం పూసి, ఒకే ఒక్క మారేడు పత్రం సమర్పించి, కైమోడ్పులిడితే సంతుష్టుడై సర్వ భోగాలను సమకూర్చగలడని ప్రతీతి. బోలా శంకరుడు జల (గంగా) ప్రియుడు. ఈ నెల శుక్ర వారంతో శ్రావణ మాసారంభం కానుండగా, నెల రోజులపాటు వివిధ ఆలయాలలో, శివ పంచాయతనాలలో, ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. శివాలయాలలో అనునిత్యం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సకృతావర్తన రుద్రాభిషేకాలు అష్టోత్తరాలు, లలిత సహస్రనామాలు పారాయణ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. శ్రావణ, భాద్రపద మాసాలు వర్షాకాలం. ఈ కాలంలో వర్షాలు పడతాయి. అన్ని రకాల ఆహార పదార్థాలు తినకుండా జాగ్రత్త వహించాలి. శరీరంలో వేడి పుట్టించే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

singidinews@gmail.com



సిన్మా సింగిడి
Cinma Singidi
ఆదివారం
16-8-2026



bandhavi sridhar

## ఓటిటి బాటపట్టిన
# చెన్నై లవ్ స్టోరీ



కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

## డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక



టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫోటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకొచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.

# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.

## కట్టలు తెంచుకున్న
# రొమాన్స్
## ..హుషారు పిట్టలు !

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణెళిశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు.

Heroine Vasavi Ganeshan



మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి – చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్థం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి – చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

# విజయ్ రణబాలి నుంచి పోస్టర్ విడుదల



స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 1854-1878 కాలంలో రాయలసీమ నేపథ్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగే చారిత్రక పోరాటం ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. 'మరపురాని చరిత్రలోని అత్యంత సాహసోపేతమైన అధ్యాయం అనే ట్యాగ్‌లైన్‌తో ఈ పోస్టర్ హైలైట్ అవుతోంది. ఈ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ రక్తం, మట్టితో కూడిన యుద్ధ వీరుడి రూపంలో కనిపిస్తున్నారు. ఆయన పొడవుగా ఉన్న జుట్టు, మీసం, ఒంటిపై గాయాలు ఈ పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. జాతీయ జెండా ఆయన భుజంపై ఒక యోధుడి కవచంలా కప్పబడి ఉంది. దీనికి ఉన్న రక్తపు మరకలు స్వాతంత్ర్య పోరాటంలోని త్యాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన లుక్ వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090